

మామునూరు ఎయిర్‌పోర్టుకు రూ.205కోట్లు! 3వ


నేటి ప్రభాత

# సూర్య

జాతీయ తెలుగు దిన పత్రిక

TGTEL/25/A0784



రిపోర్టర్లు కావలెను

పత్రిక ప్రారంభించిన అనతికాలంలోనే అత్యంత ప్రజాదరణ పొందిన నేటి ప్రభాత సూర్య తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రిపోర్టర్లు కావలెను.

అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం.

మరిన్ని వివరాలకు సంప్రదించగలరు.

9100900918

9100900931



ప్రచురణ : హైదరాబాద్ | ఎడిటర్ : పోలగోని రాజేశ్ | శనివారం | 26 - 07 - 2025 | సంపుటి : 1 | సంచిక : 54 | పేజీలు : 8 | వెల : 4/-


# డీలిమిటేషన్ డిస్‌మిస్!



## నియోజకవర్గాల పునర్విభజన పిటిషన్ ఇలాంటి వ్యాజ్యంతో గేట్లు తెరిచినట్లే పిటిషన్‌ను కొట్టివేసిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ, నేటి ప్రభాత సూర్య :**
ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో నియోజకవర్గాల పునర్విభజనపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. దీనిని ఆమోదించ లేమని, దీనివల్ల ఇతరరాష్ట్రాల్లో సమస్యలు వస్తాయని సుప్రీం ధర్మాసనం పేర్కొంది. 2026లో మొదటి జనగణన తర్వాత మాత్రమే డీలిమిటేషన్ నిర్వహిస్తామని చట్టంలో స్పష్టంగా చెప్పారని పేర్కొంది. ఇలాంటి వ్యాజ్యాన్ని అనుమతించడం వల్ల ఇతర రాష్ట్రాల్లో కూడా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలన్న వ్యాజ్యాలు వరదల్లా వస్తాయని, గేట్లు తెరిచినట్లు అవుతుందని ధర్మాసనం అభిప్రాయపడింది. తెలంగాణ, ఆంధ్రపదేశ్‌లలో అసెంబ్లీ సీట్లు పెంచేందుకు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ నిర్వహించేలా కేందప్రభుత్వాన్ని ఆదేశించాలని దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు శుక్రవారంనాడు తిరస్కరించింది. జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌తో పోలిస్తే, రాష్ట్రాల్లో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉన్నాయనే వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26ను అమలు చేసేలా కేంద్రానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రొఫెసర్ కె. పురుషోత్తం రెడ్డి దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీంకోర్టు ఈ తీర్పు ప్రకటించింది. ఈ సందర్భంగా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పాలన విషయంలో గల తేడాను కూడా ధర్మాసనం ప్రస్తావించింది. జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం ప్రకారం జమ్మూ కశ్మీర్ ను కేంద్రపాలిత ప్రాంతంగా తిరిగి ఏర్పాటు- చేయడం వల్ల రాజ్యాంగంలోని 7వ భాగంలోని 3వ అధ్యాయంలోని నిబంధనలు వర్తించబోవని జస్టిస్ సూర్యకాంత్ ఆధ్వర్యంలోని ధర్మాసనం స్పష్టం చేసింది. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలో మాత్రమే డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టి, ఆంధ్రప్రదేశ్, తెలంగాణలను మినహాయించడం రాజ్యాంగ విరుద్ధమన్న వాదనను కూడా కోర్టు తిరస్కరించింది. రాజ్యాంగం ఆర్టికల్ 170(3) ప్రకారం డీలిమిటేషన్ కోసం వచ్చిన పిటిషన్ ను స్వీకరించడానికి వీలు లేదని కోర్టు పేర్కొంది. ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం లోని సెక్షన్ 25 డీలిమిటేషన్ కు సంబంధించిన రాజ్యాంగం ఆర్టికల్ 170కి లోబడి ఉందని, దీని ప్రకారం 2026 లో చేపట్టనున్న జనాభా లెక్కల షెడ్యూల్ గణాంకాలను ప్రచురించిన తర్వాత

మిగతా 2వ పేజీలో..



ప్రధాని మోడీ విదేశీ పర్యటనల ఖర్చు రూ.350 కోట్లు

2వ

# మాల్దీవులకు భారత్ అండ

- రూ.4850 కోట్ల ఆర్థిక సాయం కొనసాగిస్తాం
- ప్రధాని మోడీ వెల్లడి



**న్యూఢిల్లీ, నేటి ప్రభాత సూర్య :**
భారత్‌కు మాల్దీవులు అత్యంత విశ్వసనీయ దేశమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. మన పొరుగు దేశంగా ఆ దేశానికి ప్రముఖ స్థానం ఉందని, ఆ దేశాన్ఇన అన్ని విధాలుగా ఆదుకుంటామని ప్రకటించారు. లైన్ ఆఫ్ క్రెడిట్ కింద రూ.4850 కోట్ల ఆర్థిక సాయం కొనసాగిస్తామన్నారు. ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జుతో భేటీ- అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. వాణిజ్య, రక్షణ మౌలిక వసతులు తదితర రంగాల్లో పరస్పర సహకారానికి ఇరు దేశాలు అంగీకరించాయని చెప్పారు. భారత్- మాల్దీవుల మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి సంబంధించి చర్చలు ప్రారంభమైనట్లు ప్రధాని మోదీ పేర్కొన్నారు. ద్వైపాక్షిక పెట్టుబడుల

మిగతా 2వ పేజీలో..



## ఇక ఏ పదవులు వద్దు!

- పదవీవిరమణ తరవాత పదవులు స్వీకరించను
- ప్రధాన న్యాయమూర్తి గవాయ్ స్పష్టీకరణ

**ముంబై :**
పదవీవిరమణ అనంతరం తాను ఏ ప్రభుత్వ పదవినీ స్వీకరించబోనని భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్.గవాయి పేర్కొన్నారు. శుక్రవారం మహారాష్ట్రలోని అమరావతి జిల్లాలోని తన స్వస్థలమైన దారాపూర్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తన పదవీ విరమణ తర్వాత తాను ఏ ప్రభుత్వ పదవిని అంగీకరించకూడదని నిర్ణయించుకున్నాను. పదవీవిరమణ తర్వాత తనకు అధిక సమయం లభిస్తుంది. దారాపూర్, అమరావతి మరియు నాగ్‌పూర్‌లలో ఉండేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. ఈ ఏడాది నవంబర్‌లో జస్టిస్ బి.ఆర్. గవాయి పదవీ విరమణ చేయనున్నారు. గ్రామానికి చేరుకున్న జస్టిస్ బి.ఆర్.గవాయికి ప్రజలు భారీ సంఖ్యలో స్వాగతం పలికారు. తన తండ్రి, కేరళ, బీహార్‌ల మాజీ గవర్నర్

మిగతా 2వ పేజీలో..



## డ్రోన్ టెక్నాలజీలో తెలంగాణ ముందంజ

- ఆపరేషన్ సిందూర్‌లో వీటి సత్తా చాటాయి
- ఎస్తోనియా దేశ రాయబారితో మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,నేటి ప్రభాత సూర్య :**
డ్రోన్ టెక్నాలజీలో తెలంగాణ గణనీయ అభివృద్ధి సాధించిందని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లో తయారైన డ్రోన్లు 'ఆపరేషన్ సిందూర్'లో పాకిస్థాన్‌కు భారీ నష్టం

మిగతా 2 లో..

# బిసి రిజర్వేషన్లు తప్పుల తడక

- కేవలం ముస్లింలకు మాత్రమే లబ్ధి
- ఎంఐఎంకు లబ్ధి చేకూరేలా రిజర్వేషన్లు
- బిసిని ప్రధానిని చేసిన ఘనత బిజెపిది
- మీడియా సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి



**హైదరాబాద్,నేటి ప్రభాత సూర్య :**
రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న రిజర్వేషన్లతో నిజమైన బిసిలు నష్టపోతారని బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. బిసిలకు రిజర్వేషన్ పేరుతో ముస్లింలకు రిజర్వేషన్ కల్పిస్తున్నారని అన్నారు. నాంపల్లిలో పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ..10 శాతం ఈబిసి రిజర్వేషన్లను ముస్లింలు కూడా పొందుతున్నారని తెలియజేశారు. 42 శాతం రిజర్వేషన్లతో బిసిలకు న్యాయం జరగదని చెప్పారు. బిసి రిజర్వేషన్ వల్ల ఎంఐఎం పార్టీకే లబ్ది చేకూరుతుందని అన్నారు. బిసిని ముఖ్యమంత్రి చేసిన చరిత్ర కాంగ్రెస్ కు ఉందా అని ప్రశ్నించారు. బిసిని ప్రధానిని చేసిన ఘనత బిజెపిదే అని కొనియాడారు. రాజకీయ లబ్ది కోసమే బిసి రిజర్వేషన్ అంశాన్ని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎత్తుకుందని విమర్శించారు. ప్రజలు తిరస్కరిస్తున్నా కాంగ్రెస్ కు బుద్ధి రాలేదని మండిపడ్డారు. అధికారంలో ఉన్న 3 రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఓడిపోతుందని, నరేంద్ర మోడీ కులాన్ని కాంగ్రెస్ ప్రభుత్వమే బిసి జాబితాలో చేర్చిందని చెప్పారు. పెంచిన బిసి రిజర్వేషన్లతోనే ఎన్నికలు జరగాలని కోరుకుంటున్నాం అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇకపోతే హైదరాబాద్ మెట్రో ఫేస్- 2 గురించి తెలంగాణ ముఖ్యమంత్రి పచ్చి అబద్ధాలు చెబుతున్నారు అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. ఈ మధ్యనే డిపీఆర్ కేంద్రానికి వచ్చింది.. మెట్రోపై అవగాహన లేకుండా రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడుతుంది.. మెట్రో గురించి కాంగ్రెస్ సర్కార్ ఇంకా సమాచారం ఇవ్వాల్సి ఉంది.. సీఎంకి మెట్రో గురించి అవగాహన లేదు..మెట్రో లైన్ల నిర్వాహణ ఎవరు చేస్తారు.. నష్టాలు ఎవరు భరిస్తారు.. గతంలో ఇచ్చిన సంస్థకు రెండో దశ నిర్మాణ నిర్వాహణ ఇస్తారా..

మిగతా 2వ పేజీలో..

# ప్రధాని మోడీనే అవమానిస్తారా

- పొన్నంనో, మహేశ్ గౌడ్‌నో సిఎం చేస్తారా
- సిఎం రేవంత్ వ్యాఖ్యలకు బిజెపి అధ్యక్షుడు రామ్ కౌంటర్



**హైదరాబాద్, నేటి ప్రభాత సూర్య :**
రేవంత్ రెడ్డికి ఆస్కార్ అవార్డు కాదు, భాస్కర్ అవార్డు ఇవ్వాలి.. నోబెల్ ప్రైజ్ కాదు, గోబెల్స్ ప్రైజ్ ఇవ్వాలి అంటూ బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు సెటైర్లు వేశారు. మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా రామచందర్ రావు సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రంగా మండిపడ్డారు. నరేంద్ర మోడీ సీఎం అయ్యే ముందు నుంచే బీసీ.. అప్పటి నుంచి ఎన్నో కులాలు బీసీల్లో కలిసిపోయినట్లు గుర్తు చేశారు. ఇక, రాహుల్ గాంధీ తల్లి తండ్రులు వేర్వేరు మతాలకు చెందినవారు, ఆయన కులం ఏంటని ప్రశ్నించారు. నిజాలు తెలుసుకుని సిఎం మాట్లాడాలన్నారు. బిసి రిజర్వేషన్లపై తప్పు పట్టించరాదన్నారు. దత్తాత్రేయని వైస్ ప్రెసిడెంట్ చేయమన్నట్టే, మేము కూడా పొన్నం ప్రభాకర్‌ను లేదా మహేష్ గౌడ్‌ను సీఎం చేయాలని డిమాండ్ చేస్తున్నాం.. బీజేపీ బీసీ పక్షపాతి.. బీసీలను పార్టీకి దూరం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయన్నారు.. మేము 42 శాతం రిజర్వేషన్‌కు సపోర్టు ఇస్తున్నాం.. అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు పెట్టి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. కేంద్రంపై నెట్టవద్దని, రాష్ట్ర ప్రభుత్వం బీసీ

మిగతా 2వ పేజీలో..

# అపరిచితుడిలా వ్యవహరిస్తున్న రేవంత్

- ఒక్కోసారి రెమో.. మరోసారి రామ్‌లా కనిపిస్తాడు
- కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు కాగితాలు ఇచ్చి గొప్పలు
- గురుకులాల్లో విద్యార్థులకు విషం పెడుతున్నారు
- 14 ఏళ్ల పోరాటం చేసి కెసిఆర్ తెలంగాణ సాధించారు
- స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాల్సిందే
- లింగంపేట ఆత్మగర్జన సభలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**కామారెడ్డి,నేటి ప్రభాత సూర్య :**
సీఎం రేవంత్‌లో అపరిచితుడు ఉన్నాడు.. ఒక్కోసారి రెమో, రామ్‌లా కనిపిస్తాడని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు. ప్రజలకు నిజమైన ముఖాన్ని చూపకుండా నటిస్తున్నాడని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌ను ఓడించాలంటూ ప్రజలకు పిలుపునిచ్చారు. మీ ఓటే తూటా.. కాంగ్రెస్ బట్టలు విప్పాలి అన్నారు. ఇక, రైతులకు ఇవ్వాల్సిన రైతు బంధు నిధులు ఇంకా అందలేదు.. కానీ, మూటలు ఢిల్లీకి వెళ్తున్నాయి.. రాహుల్ గాంధీ ఖాతాలో డబ్బులు పడుతున్నాయ్ అంటూ కేటీఆర్ ఆరోపించారు. కామారెడ్డి జిల్లా లింగంపేటలో బీఆర్ఎస్ పార్టీ ఘనంగా నిర్వహించిన ఆత్మగర్జన సభలో కేటీఆర్ తో పాటు మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సభలో కేటీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ఇచ్చిన ఉద్యోగాలకు ఇప్పుడు కాగితాలు ఇచ్చి నేనే ఉద్యోగాలు ఇచ్చినట్లు- రేవంత్ రెడ్డి చెబుతున్నారని కేటీఆర్ అన్నారు. ఇది ప్రజలను మోసగించడమేనన్నారు. ప్రభుత్వాన్ని నడిపించే వాడు నిజంగా బాధ్యత గల నాయకుడు అయితే సంపద, ఆదాయం పుడుతుందన్నారు. అలాగే, గురుకులాల్లో విద్యార్థులకు విషం పెడుతున్నారు.. ఇప్పటి వరకు 100 మంది విద్యార్థులు చనిపోయారు అని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్రంగా

మిగతా 2వ పేజీలో..

# నిబంధనలకు విరుద్ధంగా అంతస్తులకు అంతస్తులు

- నోటీసులకే పరిమితం.. చర్యలు శూన్యం
- టౌన్ ప్లానింగ్ పనితీరుపై తీవ్ర విమర్శలు.



**ఎల్బీనగర్- నేటి ప్రభాత సూర్య:**
అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.. నిబంధనలకు మించి నిర్మాణం చేపడితే నోటీసులు ఇచ్చి సదరు నిర్మాణాన్ని నేలమట్టం చేస్తాం'..ఇది బల్దియా టౌన్‌ప్లానింగ్ అధికారులు,

మిగతా 2వ పేజీలో..

# ఐదో రోజూ సాగని పార్లమెంట్

- ఉభయ సభల్లో విపక్షాల నిరసన
- సోమవారానికి వాయిదా పడ్డ ఉభయసభలు

**న్యూఢిల్లీ, నేటి ప్రభాత సూర్య :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వరుసగా ఐదవరోజు శుక్రవారం ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకుండానే వాయిదా పడ్డాయి. దీంతో సభ సోమవారానికి వాయిదా పడ్డాయి. బీహార్ ప్రత్యేక ఓటర్ల జాబితా ఎస్ఐఆర్ పై ప్రతిపక్షాలు నిరసన చేపడుతుంటే..చర్చ జరిపేందుకు అనుమతిని ఇవ్వకుండా ప్రభుత్వం మొండిపట్టు పడుతోంది. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా నలుగురు కన్నా ఎక్కువ సభ్యులు ఉన్న పార్టీల లోక్‌సభ ఫ్లోర్ లీడర్లతో సమావేశాలు నిర్వహించారు. సమావేశం తర్వాత, ఏకాభిప్రాయం కుదిరిందని అన్నారు. లోక్‌సభ ఆపరేషన్ సిందూర్ గురించి సోమవారం చర్చ జరపనున్నట్లు తెలిపారు. సభ ప్రారంభమైన వెంటనే, ప్రతిపక్ష సభ్యులు బీహార్‌లో ఎస్ఐఆర్ సవరణ అంశాన్ని లేవనెత్తడానికి యత్నించారు. వారిలో చాలా మంది నినాదాలు చేపట్టారు. స్పీకర్ ఓంబిర్లా సభ్యులకు ప్రశ్నోత్తరాల సమయాన్ని కొనసాగించేందుకు అనుమతించమని చెప్పారు. ప్రతిపక్షాలు సభలో నినాదాలు చేపట్టడంతో పాటు- ప్లకార్డులు ప్రదర్శించారు. దీంతో సభను మధ్యాహ్నం 2.00 గంటల వరకు వాయిదా వేశారు. ముందుగా సభ ప్రారంభమైన వెంటనే తమిళనాడు నుండి కొత్తగా ఎన్ని-కై-న కమల్‌హాసన్, రాజాతి, ఎస్.ఆర్.శివలింగం, పి.విల్సన్‌లు ప్రమాణస్వీకారం చేశారు. బీహార్ ఎస్ఐఆర్ సహా వివిధ అంశాలపై చర్చను డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఇచ్చిన వాయిదా నోటీ-సులను డిప్యూటీ- చైర్మన్ హరివంశ్ రారు తిరస్కరించారు. ఇతర రాష్ట్రాల్లో బెంగాలీ వలసకార్మికులపై వివక్ష, భారత్ -యుకెల మధ్య టిఎస్ఎ ఒప్పందం వంటి వివిధ అంశాలపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ రూల్ 267 కింద 28 నోటీ-సులిచ్చారు. మధ్యాహ్నం 12గంటల వరకు సభ వాయిదా పడింది. వాయిదా అనంతరం కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడటానికి యత్నించారు. కానీ ప్రతిపక్ష ఎంపిల నిరసనల మధ్య రాజ్యసభ సోమవారానికి వాయిదా పడింది.



## తెలంగాణ కేబినేట్ భేటీ వాయిదా

**28న జరపాలని సిఎం నిర్ణయం**



**హైదరాబాద్, నేటి ప్రభాత సూర్య :** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ సమావేశం వాయిదా పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన ఈ నెల 25వ తేదీ శుక్రవారం జరగాల్సిన కేబినెట్ భేటీ వాయిదా పడింది. ఐదుగురు మంత్రులు ఢిల్లీలో ఉండటంతో తాత్కాలికంగా నిలిపివేశారు. తాజా నిర్ణయం ప్రకారం, మంత్రివర్గ సమావేశాన్ని ఈ నెల 28వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించాలని నిర్ణయించినట్లు- తెలుస్తోంది. మంత్రులు.. పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, వాకిటి శ్రీహరి..ఢిల్లీలో జరుగుతున్న ఏఐసీసీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లినట్లు సమాచారం. ఈ సమావేశానికి సంబంధించి వారు కాంగ్రెస్ హైకమాండ్ సూచన మేరకు ఢిల్లీకి వెళ్లారు. ఇతర ఇద్దరు కీలక మంత్రులు.. డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్నారు. దీంతో శుక్రవారం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించాల్సిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం వాయిదా పడింది. దుగురు మంత్రులు దిల్లీలోనే ఉండటంతో క్యాబినెట్ సమావేశం వాయిదా వేయాలని సీఎం నిర్ణయించారు. ఈనెల 28న మధ్యాహ్నం 2 గంటలకు క్యాబినెట్ భేటీ- నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు.



## 2021 నుండి 2025 మధ్య ప్రధాని విదేశీ పర్యటనలు

- ప్రధాని మోడీ విదేశీ పర్యటనల ఖర్చు రూ.350 కోట్లు
- వెల్లడించిన విదేశాంగ శాఖ

**న్యూఢిల్లీ,నేటి ప్రభాత సూర్య :** ప్రధాని మోడీ విదేశీ పర్యటనల కోసం రూ.350 కోట్లు ఖర్చు చేసినట్లు- కేంద్రం ప్రకటించింది. 2021 నుండి 2025 మధ్య ప్రధాని పర్యటనల కోసం దేశ ఖజానా నుండి సుమారు రూ. 300 కోట్లు- వరకు ఖర్చు చేసినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ ఏడాది ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో అమెరికా, ఫ్రాన్స్, మారిషస్, థాయిలాండ్, శ్రీలంక, సౌదీ అరేబియా పర్యటనకు ఖర్చు చేసిన రూ.67 కోట్లు కూడా ఇందులో ఉన్నాయి. టిఎంసి రాజ్యసభ ఎంపి డెరెక్ ఒబ్రెయిన్ ప్రశ్నలకు విదేశాంగ మంత్రిత్వ శాఖ లిఖిత పూర్వక సమాధానమిచ్చింది. ఫిబ్రవరి 10 నుండి 13 మధ్య మోడీ ఫ్రాన్స్, అమెరికాలను సందర్శించారని, ఫ్రాన్స్ పర్యటనకు అత్యధికంగా 25 కోట్లు, అమెరికా పర్యటనకు రూ.16 కోట్లు ఖర్చు అయ్యాయని డేటా వెల్లడించింది. ఏప్రిల్ 3-6ల మధ్య థాయిలాండ్, శ్రీలంక పర్యటనలకు రూ.9 కోట్లకు పైగా ఖర్చయింది. థాయిలాండ్‌కు రూ.4 కోట్ల 92 లక్షలు, శ్రీలంకకు రూ.4 కోట్ల 46 లక్షలు). ఏప్రిల్ 22-23 మధ్య సౌదీ అరేబియాకు వెళ్లారు. ఈ పర్యటనకు రూ.15 కోట్ల 54 లక్షల 03వేల 792.47 ఖర్చయింది. మార్చి 11-12 మధ్య ప్రధాని మారిషస్‌కు, జులై 15-19 తేదీల మధ్య సైప్రస్, కెనడా , క్రొయేషియా మరియు ఘనాల్లో పర్యటించారు. జులై 2-9ల మధ్య ట్రినిడాడ్, టబాగో, అర్జెంటీనా, బ్రెజిల్ మరియు నమీబియాలను సందర్శించారు. కానీ ఈ బిల్లులు పూర్తికానందున ఖర్చుల వివరాలను వెల్లడించలేదు. 2024 లో, ఫిబ్రవరి 13-15 మధ్య ప్రధాని యుఎఇ, ఖతార్‌లను సందర్శించారు. ఆ సమయంలో దేశ ఖజానా 3 కోట్ల14 లక్షల30వేల 607 రూపాయలు ఖర్చు చేయగా, మార్చి 22-23 మధ్య భూటాన్ పర్యటనకు 4కోట్ల 50లక్షల27వేల 271రూపాయలు ఖర్చు చేసింది. జూన్ 13-14 మధ్య ఇటలీ పర్యటన కోసం రూ. 14కోట్ల 36లక్షల 55వేల 289 ఖర్చు చేసింది. జులై8-10 మధ్య ఆస్ట్రియా మరియు రష్యా పర్యటనల కోసం వరుసగా రూ. 4 కోట్లకు పైగా, రూ. 5 కోట్లకు పైగా ఖర్చు చేసింది. 2024 ఆగస్టు 21-23 మధ్య జరిగిన రెండు పర్యటనల కోసం ఈ క్రింది ఖర్చు చేసినట్లు- విదేశాంగ శాఖ తెలిపింది. పోలాండ్‌కు రూ.10 కోట్లకు పైగా, ఉక్రెయిన్‌కు రూ.2కోట్లకు పైగా ఖర్చు చేసింది. సెప్టెంబర్ 3-5 మధ్య బ్రూనై పర్యటనకు కేంద్రం రూ కోట్లకు పైగా ఖర్చు చేసింది.

## నిబంధనలకు విరుద్ధంగా అంతస్తులకు అంతస్తులు

మొదటిపేజీ తరువాయి..

కమిషనర్ చెప్పే మాట..కానీ క్షేత్రస్థాయిలో మాత్రం కాసులకు కక్కుర్తి పడుతూ అక్రమార్కులకు అధికారులు కొమ్ముకాస్తున్నారు. మున్సిపల్ ఆఫీస్ కి కూత వేటు దూరంలో నిర్మాణం జరుతున్న విషయం పై పలు పిర్యాదులు వెళ్ళు వేత్తిన అధికారులు పట్టించు కోవడం లేదు..వివరాల్లోకి వెలితే కొత్తపేట లోని అష్ట లక్ష్మి కామన్ రోడ్డు లో ఏలాంటి అనుమతులు లేకుండా సెల్లార్ తో పాటు కమర్షియల్ భవనం నిర్మిస్తున్నాడు. ఆరోడ్డు 60 ఫిట్ల రోడ్డుగా మాస్టర్ ప్లాన్ లో ఉన్నప్పటికి ఏలాంటి సెట్ బ్యాక్ లేకుండా అక్రమంగా నిర్మాణం కొనసాగుతుంది. అక్రమ భవన నిర్మాణాలకు పర్మిషన్లు ఉన్నాయా..? లేదా..? అసలు అనుమతి కోసం టీఎస్ బి పాస్ లో అప్లై చేసుకున్నారా..? అనే ప్రశ్నలకే తావులేకుండా అక్రమ నిర్మాణదాతలు యథేచ్ఛగా అంతస్థుల మీద అంతస్తులు కట్టేస్తున్నారు. ఆ వైపు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికా రులు, సిబ్బంది వెళ్లినా చూసీ చూడనట్టుగా వ్యవహరిం చడం, అక్రమార్కులకు వత్తాసు పలుకుతుండడంతో ఈ తరహా నిర్మాణాలకు జోరందుకున్నాయి. ఫిర్యాదు చేసినా.. ఒత్తిడి తెచ్చినా.. కేవలం నోటీసులతో సరిపెడుతున్నారే తప్ప.. ఆపై చర్యలకు వెళ్లడం లేదు. ఇదే సమయంలో సదరు షోకాజ్ అందుకున్న నిర్మాణదారుడుడబ్బులిస్తే చాలు ..కొందరు అధికారులు ఆ నిర్మాణం జోలికి వెళ్లడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## డీలిమిటేషన్ డిస్‌మిస్!

మొదటిపేజీ తరువాయి..

మాత్రమే డీలిమిటేషన్ నిర్వహించవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.అంతకు ముందు విచారణ సందర్భంగా పిటిషనర్ తరుపు న్యాయవాది తన వాదనలను వినిపిస్తూ, ఏపీ, తెలంగాణాలను మినహాయించి, కొత్తగా ఏర్పడిన జమ్మూకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతంలోనే అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల డీలిమిటేషన్ చేపట్టడం అసమంజసం, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్ కోసం చేపట్టిన డీలిమిటేషన్ పక్రియను ప్రస్తావిస్తూ, ఆంధ్రప్రదేశ్ పునరవ్యవస్థీకరణ చట్టం అమలులోకి వచ్చిన తర్వాత నియమింపబడిన ఏకై-క కమిషన్ ఈ డీలిమిటేషన్ కమిషన్ అని పిటిషనర్ తరుపు న్యాయవాది వాదించారు. ఈ సందర్భంలో సుప్రీంకోర్టు జస్టిస్ జోక్యం చేసుకుంటూ, కేంద్రం ఎప్పుడు డీలిమిటేషన్ చట్టం చేసినా అది అన్ని రాష్ట్రాలకు ఒకే విధంగా వర్తింపజేయాలన్నది మీ ఉద్దేశ్యమా అని న్యాయవాదిని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం తరుపున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం. నటరాజ్ తన వాదనలో ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26ను ఎత్తిచూపారు. ఈ రాష్ట్రాలు డీలిమిటేషన్ పక్రియకోసం 2026 జనాభా లెక్కలవరకూ వేచి ఉండవలసిందేనని పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది పెద్దఎత్తున చేపట్టవలసిన కసరత్తు అనీ, రాత్రికి రాత్రే దీనిని చేపట్టలేమని నాగరాజ్ వాదించారు. 2022లో ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ కోటేశ్వర్‌సింగ్ ధర్మాసనం తుది ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 26 ప్రకారం నియోజకవర్గాల పెంపు ప్రతిపాదనకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ కోరారు. జమ్ముకశ్మీర్‌లో పునర్విభజన చేసే సమయంలో ఏపీ విభజన చట్టాన్ని పక్కన పెట్టి రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరించారని పేర్కొన్నారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ..170(3) అధికరణం ప్రకారం ఏపీ విభజన చట్టంలో సెక్షన్ 26కి పరిమితి ఉందని తెలిపింది. కేంద్ర పాలిత ప్రాంతాలతో పోల్చినప్పుడు రాష్ట్రాల్లో డీలిమిటేషన్‌కు సంబంధించిన నిబంధనలు భిన్నంగా ఉంటాయని సర్వోన్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. జమ్మూకశ్మీర్‌పై ప్రత్యేక దృష్టి సారించారన్న పిటిషనర్ వాదనను న్యాయస్థానం తిరస్కరించింది. జమ్మూకశ్మీర్ కోసం జారీ చేసిన నియోజకవర్గాల పునర్విభజన నోటిఫికేషన్ నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణను మినహాయించడం.. ఏకపక్షం, వివక్ష కాదని స్పష్టం చెప్తూ పురుషోత్తం రెడ్డి పిటిషన్ సుప్రీంకోర్టు కొట్టివేసింది.

## ప్రధాని మోడీనే అవమానిస్తారా

మొదటిపేజీ తరువాయి..

రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత ఉందని వెల్లడించారు. బీజేపీలో ఉన్న రెడ్డి నేతలెవరూ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా లేరని, పార్టీ లీడర్ మహేశ్వర్ రెడ్డి కూడా ఈ విషయాన్ని తెలియజేశారని రామచందర్ రావు చెప్పారు. గవర్నర్ దత్తాత్రేయ మీద రేవంత్ రెడ్డికి ప్రేమ ఉండడం సంతోషం అని రామచందర్ రావు తెలిపారు. నరేంద్ర మోడీ బిసి కాదని రేవంత్ రెడ్డి అవమానించారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కన్వర్టడ్ అని రేవంత్ రెడ్డి కొత్త పదం సృష్టించారని రామచందర్ రావు ఎద్దేవ చేశారు.అయితే, పార్టీలో పోస్టుల కోసం ఒత్తిడి చేయొద్దు అన్నారు. మనం అందరం పార్టీ కార్యకర్తలమే, పదవులు వచ్చినవారు ఎక్కువ కాదు, రానివారు తక్కువ కాదని వెల్లడించారు. వారం రోజుల్లో పార్టీ కొత్త కమిటీ-ని ప్రకటిస్తుంది.. అందులో మొత్తం 20 మందిని నియమిస్తాం.. 33 శాతం మహిళలకు ప్రాధాన్యం ఇస్తామని రామచందర్‌రావు చెప్పుకొచ్చారు. ఇక, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ఇచ్చిన సూచనలమేరకు పార్టీ నేతలు ఎక్కువ టూర్లు చేయాలని, కార్యకర్తల్ని కలవాలని రామ చందర్ రావు పేర్కొన్నారు. పార్టీ అంతర్గత సమస్యలు కుటుంబ సమస్యల వంటివే, వాటిని బయటకు తీసుకురావద్దు అన్నారు.

## అపరిచితుడిలా వ్యవహరిస్తున్న రేవంత్

మొదటిపేజీ తరువాయి..

ఆగ్రహం వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని కేటీఆర్ అన్నారు. బోధించు, సమీకరించు, పోరాడు, అన్న బాబాసాహెబ్ బాటలోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు- కోసం కేసీఆర్ ఉద్యమించారని పేర్కొన్నారు. లక్షలాది మందిని సమీకరించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు- అవసరాన్ని వాళ్లకు బోధించి, ఎత్తిన జెండా దించకుండా 14 ఏళ్ల పాటు- కేసీఆర్ కొట్లాడితే తెలంగాణ వచ్చిందని కేటీఆర్ తెలిపారు. ఆ మహనీయున్ని గౌరవించుకోవడానికి తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రపంచం లో ఎక్కడా లేనివిధంగా 125 అడుగుల విగ్రహాన్ని హైదరాబాద్ నడిబొడ్డున ప్రతిష్టించుకున్నామని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సమున్నతంగా గౌరవించుకున్నామని తెలిపారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పేరును సెక్రటేరియట్ కు పెట్టిన ఒకే ఒక ముఖ్యమంత్రి భారతదేశంలో కేసీఆర్ ఒక్కరే అని కొనియాడారు. అంబేద్కర్‌ను అంత గొప్పగా గౌరవించుకున్న ముఖ్యమంత్రి దేశంలో ఇంకెవరూ లేరని అన్నారు. దళితుల జీవితాల్లో అద్భుతమైన మార్పు తీసుకురావాలన్న లక్ష్యంతో లక్షలాది దళితులకు మేలు చేయాలన్న సంకల్పంతో దళిత బంధు పథకాన్ని కేసీఆర్ తీసుకొచ్చారని కేటీఆర్ తెలిపారు. దళిత బంధు పేరుమీద కేసీఆర్ రూ.10 లక్షల మాత్రమే ఇస్తున్నారని.. తాము అధికారంలోకి వస్తే రూ.12 లక్షలు ఇస్తామని చేవెళ్లలో ఏఐసీసీ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే సమక్షంలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్కలు ప్రకటించారని గుర్తుచేశారు. అన్ని ప్రభుత్వ పనుల్లో 26శాతం ఎస్సీ, ఎస్టీలకు ఇస్తామన్నారని.. దళిత, గిరిజనులు ఇండ్లు నిర్మించుకుంటే ఆరు లక్షలు ఇస్తామని ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ లో చెప్పారు. కానీ అధికారంలోకి వచ్చాక ఆరు పైసలు కూడా ఇవ్వని సిగ్గులేని ప్రభుత్వం రేవంత్ రెడ్డిది అని విమర్శించారు. ఈ శతాబ్దపు అతిపెద్ద మోసం తెలంగాణ కాంగ్రెస్ మేనిఫెస్టో అని కేటీ-ఆర్ విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చేతిలో అన్ని వర్గాల ప్రజలు దారుణంగా మోసపోయారని అన్నారు. రెండుసార్లు రైతుబంధును ఎగ్గొట్టిన రేవంత్ రెడ్డి, స్థానిక సంస్థల ఎన్నికలు ఉన్నాయన్న కారణంగా మొన్న రైతుబంధు వేశాడని అన్నారు. అరకొరగా రైతుబంధు వేసి సంబరాలు చేసుకోమంటు-న్న దిక్కుమాలిన ప్రభుత్వం ఇది అని విమర్శించారు. కేసీఆర్ రైతులకు రూ.10,000 ఇస్తే తాము రూ.15000 ఇస్తామన్నారని.. ముసలి వాళ్లకు ఇస్తున్న 2 వేల పెన్షన్ ను రూ.4000 చేస్తామన్నారని గుర్తుచేశారు. కేసీఆర్ ఇంట్లో ఒకరికి మాత్రమే పెన్షన్ ఇస్తున్నాడు తాము అధికారంలోకి వస్తే ఇద్దరికీ ఇస్తామన్నారన్నారు. అత్తకు 4,000, కోడలు 20,000 ఇస్తామన్నారు. కాని అధికారంలో వచ్చాక ఈ హామీల్లో ఒక్కదాన్ని కూడా అమలుచేయడం లేదని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తామన్నారు.. 50 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయాల్సి ఉంటే దాన్ని చివరకు రూ.12 వేల కోట్లకు కుదించి అది కూడా సగమే చేశారని అన్నారు. ఆడబిడ్డలకు తులం బంగారం, నెలకు 2,500 రూపాయలు ఇవ్వడం లేదు. వడ్లకు బోనస్ ఇస్తామని అన్ని బోగస్ మాటలు చెప్పారని మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్ ఇద్దరి ఉద్యోగాలు ఊడగొడితే మొదటి సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. కానీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో పూర్తైన నియామకాలకు సిగ్గు లేకుండా ఆఫర్ లెటర్లు ఇస్తూ తామే ఇచ్చామని రేవంత్ రెడ్డి చెప్పుకుంటు న్నాడు. మంది పిల్లల్ని నా పిల్లలని చెప్పుకుంటున్నారని మండిపడ్డారు. కేసీఆర్ అప్పులపాలు చేశారని కాంగ్రెస్ వాళ్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. కరోనా లాంటి కష్టకాలంలో కూడా కేసీఆర్ గారు ఆపకుండా రైతుబంధు, కేసీఆర్ కిట్లు-, పెన్షన్లు, కళ్యాణ లక్ష్మి, గురుకులాల్లో సన్న బియ్యం పెట్టారని గుర్తుచేశారు. ప్రభుత్వాన్ని నడిపే దమ్ము ఉన్నవారికే ఆదాయాన్ని తెచ్చే సత్తా ఉంటుంది. సంపద పెంచి పేదలకు పంచే తెలివి ఉంటుందని అన్నారు. రాహుల్ గాంధీ ఖాతాలో మాత్రమే టకీ టకీమని డబ్బులు పడుతున్నాయని విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఓటే తూటా. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటి బీఆర్ఎస్ ను గెలిపించుకుంటేనే అహంకారంతో విర్రవీగుతున్న రేవంత్ రెడ్డి, ఆయన తొత్తులుగా వ్యవహరిస్తున్న అధికారులకు బుద్ధి వస్తుందని అన్నారు. గురుకులాల్లో పిల్లలకు విషం పెడుతున్నారని.. రేవంత్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఇప్పటికే వంద మంది పిల్లలు బలి అయ్యారని కేటీ-ఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. వేములవాడకు వచ్చిన రేవంత్ రెడ్డి తిన్న భోజనం ఖరీదు ఒక ప్లేటు-కు లక్ష 35 వేల రూపా యలు. అందాల పోటీ-ల్లో ఒక్క ప్లేట్ భోజనానికి లక్ష రూపా యలు ఖర్చు చేసిన ప్రభుత్వానికి కనీసం వంద రూపాయలతో గురుకులాల పిల్లలకు మంచి భోజనం పెట్టాలన్న సోయి లేదని మండిపడ్డారు. కేసీఆర్ నాయకత్వంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నేతృత్వంలో తెలంగాణ గురుకులాలు ప్రపంచ స్థాయి ప్రమాణాలతో అద్భుతంగా పనిచేశాయని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో తెర్లు అయిన తెలంగాణలో మళ్లీ బాగు చేసుకోవా లంటే కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి కావాల్సిందే అని వ్యాఖ్యానించారు.

## మాల్దీవులకు భారత్ అండ

మొదటిపేజీ తరువాయి..

ఒప్పందం ఖరారుకు ఇరు దేశాలు కృషి చేయనున్నాయని చెప్పారు. భారత్ అనుసరించే 'పొరుగుకే తొలి ప్రాధాన్యం', 'మహాసాగర్' విధానాల్లో మాల్దీవులకు ముఖ్యమైన స్థానం ఉందన్నారు. రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేసుకునేందుకు ద్వీప దేశానికి భారత్ ఎప్పుడూ మద్దతిస్తుందని స్పష్టం చేశారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఉదయం మాల్దీవులకు వెళ్లిన ప్రధాని మోదీకి అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు సహా కీలక మంత్రులు వెలెనా ఎయిర్‌పోర్టులో స్వాగతం పలికారు. అనంతరం అక్కడి సైనికుల నుంచి ప్రధాని మోదీ గౌరవ వందనం స్వీకరించారు. ఇరుదేశాల మంత్రుల స్థాయిలో చర్చలతోపాటు- మోదీ, మొయిజ్జుల మధ్య భేటీలు జరిగాయి. ఈ సందర్భంగా పలు ద్వైపాక్షిక అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు- తెలిసింది.

## ఇక ఏ పదవులు వద్దు!

మొదటిపేజీ తరువాయి..

ఆర్.ఎస్.గవాయి స్మారక చిహ్నం వద్ద పుష్ప గుచ్ఛాలు ఉంచి నివాళులు అర్పించారు. అనంతరం దారాపూర్ వెళ్ళే మార్గంలో తన తండ్రి పేరు మీద నిర్మిస్తోన్న భారీ గేటుకు శంకుస్థాపన చేశారు. శుక్రవారం సాయంత్రం అమరావతి జిల్లాలోని దర్యాపూర్ పట్టణంలో ఒక కోర్టు భవనాన్ని ప్రారంభించనున్నారు. అలాగే శనివారం అమరావతి జిల్లా సెషన్స్ కోర్టులో టి.ఆర్. గిల్డా మెమోరియల్ ఇ-లైబ్రరీని ప్రారంభించనున్నారు.

## డ్రోన్ టెక్నాలజీలో తెలంగాణ ముందంజ

మొదటిపేజీ తరువాయి..

కలిగించాయని చెప్పారు. ఎస్తోనియా దేశ రాయబారి మ్యారియే లూప్ ఆధ్వర్యంలో ఆ దేశ వాణిజ్య ప్రతినిధుల బృందంతో సచివాలయంలో మంత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ-గవర్నెన్స్, హెల్త్ రికార్డుల డిజిటలైజేషన్‌లో ప్రపంచంలోనే అద్భుత ప్రగతి సాధించిన ఎస్తోనియా సహకారం తీసుకుంటామన్నారు. వాణిజ్యం, ఏఐ సాంకేతికత, సైబర్ సెక్యూరిటీలో కూడా కలిసి పనిచేయాలని ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని మంత్రి కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, బ్రాండెడ్ మద్యం ఉత్పత్తి రంగాల్లో తెలంగాణ ముందంజలో ఉందని.. తమతో కలిసి పనిచేసే విషయాన్ని పరిశీలించాలని మంత్రి సూచించారు. సెప్టెంబరులో తమ దేశం సందర్శించాలని శ్రీధర్‌బాబును ఎస్తోనియా రాయబారి మ్యారియే లూప్ కోరారు. తమ అధికారుల బృందం వచ్చి.. విద్య, ఈ-గవర్నెన్స్, ఏఐ, రోబోటిక్స్‌లో పరస్పరం సహకారంపై చర్చిస్తుందని మంత్రి తెలిపారు. సమావేశంలో ఐటీ-, పరిశ్రమల శాఖ ప్రత్యేక సీఎస్ సంజయ్ కుమార్, మీ సేవ కమిషనర్ రవికిరణ్, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లు తప్పల తడక

మొదటిపేజీ తరువాయి..

కొత్త సంస్థ వస్తే వాటితో సమన్వయం ఒప్పందం అంశాలు కేంద్రానికి తెలియజేయాల్సి ఉంటు-ందన్నారు. మెట్రో విషయంలో కేంద్రం రాష్ట్రానికి సహకారంతో పాటు- నిధులను ఇస్తుంది.. మెట్రో విషయంలో కేంద్ర- రాష్ట్ర అధికారులతో సమావేశం ఏర్పాటు-కు మోడీ సర్కార్ సిద్ధంగా ఉంది అని కిషన్ రెడ్డి వెల్లడించారు. ఇక, నేను రాష్ట్ర అంశాలను అనేక సార్లు కేంద్రమంత్రుల దృష్టికి తీసుకెళ్లాను అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి వేసే పనికిరాని ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాను అని తేల్చి చెప్పారు. కేసీఆర్ ను కాపాడాలని రాహుల్ గాంధీ చూస్తున్నారు.. కాంగ్రెస్- బీఆర్ఎస్ పార్టీల మధ్య అవగాహన కుదిరింది.. ఇక, బండి సంజయ్- ఈటల రాజేందర్ విషయంలో బీజేపీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటుందని కిషన్ రెడ్డి తెలిపారు.

## హుస్సేన్‌సాగర్ ఫుల్

**హైదరాబాద్ - నేటి ప్రభాత సూర్య :** ఎగువ ప్రాంతాలనుంచి వస్తున్న వరద ప్రవాహంతో హుస్సేన్ సాగర్ నిండుకుండలా మారింది. బంజారా, కూకట్ పల్లి, బుల్కాపూర్ నాలాలనుంచి హుస్సేన్ సాగర్ కు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో హుస్సేన్ సాగర్ నీటి మట్టం ఫుల్ ట్యాంక్ లెవెల్ కు చేరింది. హుస్సేన్ సాగర్ పూర్తి స్థాయి నీటిమట్టం 513.41 మీట్లరు కాగా.. ప్రస్తుతం నీటిమట్టం 513.19 మీటర్లకు చేరింది. ఎ÷ుర పరిధి దాటకుండా వాటర లెవెల్ ను మెయింటెన్ చేస్తున్నారు అధికారులు. తూముల ద్వారా మిగతా నీటిని మూసిలోకి విడుదల చేస్తున్నారు.

## రాజ్యసభ సభ్యుడిగా కమల్ ప్రమాణం



**న్యూఢిల్లీ, నేటి ప్రభాత సూర్య :** నటుడు కమల్ హాసన్ సహా తమిళనాడు నుంచి కొత్తగా ఎన్నికైన నలుగురు రాజ్యసభ సభ్యులు శుక్రవారం రాజ్యసభ సభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. ప్రమాణస్వీకారం చేసిన ఇతర ముగ్గురు ఎంపీలు రాజాతి, ఎస్ఆర్. శివలింగం, పి.విల్సన్. కమల్ హాసన్ ఎంఎన్ఎం పార్టీకి చెందినవారు కాగా, మిగిలిన ముగ్గురు డిఎంకెకి చెందినవారు. నలుగురు సభ్యులు తమిళంలో ప్రమాణస్వీకారం చేశారు. తమిళనాడుకు చెందిన ఆరుగురు సభ్యులు గురువారం తమ పదవీకాలం పూర్తయిన తర్వాత పదవీ విరమణ చేశారు.

## తెలంగాణలో పిజి ఈసెట్, లాసెట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదల

**హైదరాబాద్ - నేటి ప్రభాత సూర్య :** తెలంగాణలో పిజి ఈసెట్, లాసెట్ అడ్మిషన్ల షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 26న నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఆగస్ట్ 1నుండి 9 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించారు. 11,12 తేదీల్లో మొదటి విడత వెబ్ ఆప్షన్లు, 16న సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. ఆగస్ట్ 18 నుండి 21 వరకు కాలేజీల్లో విద్యార్థులు రిపోర్ట్ చేయాల్సి వుంటుందని అన్నారు. లాసెట్ అడ్మిషన్లకు ఆగస్ట్ 4 నుండి 14 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇచ్చారు. 16,17 తేదీల్లో వెబ్ ఆప్షన్లు, 22 సీట్ల కేటాయింపు చేపట్టనున్నారు. 22 నుండి 25 వరకు సెల్ఫ్ రిపోర్టింగ్‌కు అవకాశం ఉంది.



## మామునూరు ఎయిర్‌పోర్టులో కదలిక

**భూసేకరణకు రూ.205 కోట్లు విడుదల**

**హైదరాబాద్,నేటి ప్రభాత సూర్య :** వరంగల్‌లోని మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణం పనుల్లో మరో కీలక ముందడుగు పడింది. ఎయిర్‌పోర్టు భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. రూ.205 కోట్లు విడుదల చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇప్పటికే భూములు కేటాయించలేదని ఆరోపణలు వచ్చాయి. మామునూరు వద్ద కొత్త బ్రౌన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు మార్చి నెలలో పచ్చజెండా ఊపారు. ఈ విమానాశ్రయానికి అన్ని అనుమతులు ఇస్తూ.. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ నిర్మాణం ప్రారంభించడానికి వీలుగా సంబంధిత దస్త్రంపై సంతకం చేశారు. మరో 253 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరించి ఇస్తే కొత్త విమానాశ్రయ నిర్మాణం మొదలుపెడతామని కేంద్రమంత్రి ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే భూసేకరణ కోసం ప్రభుత్వం తాజాగా నిధులు విడుదల చేసింది. దీంతో పనుల్లో వేగం పుంజుకోనుంది. భూములను ఇచ్చేందుకు స్థానికులు వెనకాడడం కూడా ఓ కారణంగా చెప్పుకోవాలి.

## ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు రెగ్యులేటరీ కమిషన్

**హైదరాబాద్ - నేటి ప్రభాత సూర్య :** రాష్ట్రంలోని ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణ కోసం రెగ్యులరేషన్ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 9 మందితో ఏర్పాటైన ఈ రెగ్యులరేషన్ కమిటీ చైర్మన్‌గా ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డి నియమితులయ్యారు. 2025 నుంచి 28 మధ్య పారామిటర్స్ పరిగణలోకి తీసుకుని రిపోర్ట్ ఇవ్వాలని కమిటీని ఆదేశించింది ప్రభుత్వం. ఈ కమిటీ అధికారులు, ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో చర్చించి ఫీజుల నియంత్రణకు ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది. ఈ కమిటీ సిఫారసుల ఆధారంగా ప్రైవేట్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణపై తెలంగాణ సర్కార్ నిర్ణయం తీసుకోనుంది.

## అశ్లీల కంటెంట్ యాప్‌లపై నిషేధం

**కఠిన చర్యలు తీసుకుంటామని కేంద్రం హెచ్చరిక**

**న్యూఢిల్లీ, నేటి ప్రభాత సూర్య :** అశ్లీల కంటెంట్‌ని ప్రసారం చేస్తున్న యాప్‌లపై కేంద్రం కొరడ ఝుళిపించింది. ఉల్లు, ఎఎల్‌టిటి సహా 24 యాప్‌లపై కేంద్రం నిషేధం విధించింది. ఈ మేరకు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. 24 యాప్‌లు, వెబ్‌సైట్లపై నిషేధం విధించిన కేంద్రం.. ఆ వెబ్‌సైట్లు, యాప్‌లు ఇంటర్నెట్‌లో కనిపించకుండా చేయాలని ఇంటర్నెట్ ప్రొవైడర్లను ఆదేశించింది ఈ నిబంధనలను ఉల్లంఘిస్తే.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఒటిటి ప్రసార యాప్‌లు, వాటి సర్వీస్ ప్రొవైడర్లు తాము ప్రసారం చేసే కంటెంట్ విషయంలో బాధ్యతయుతంగా ఉండాలని పేర్కొంది. చట్టాలను ఉల్లంఘించే కంటెంట్‌ను ప్రసారం చేస్తే తీవ్ర పరిణామాలు ఎదురుకోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. ఉల్లు, ఎఎల్‌టిటి, బిగ్ షాట్స్, బూమెక్స్, నవరస లైట్, గులాబ్ యాప్, కంగన్ యాప్, బుల్ యాప్, జల్వా యాప్, వావ్ ఎంటర్‌టైన్‌మెంట్, లుక్ ఎంటర్‌టైన్‌మెంట్, హిట్ ప్రైమ్, ఫినియో, షో ఎక్స్, సోల్ టాకీస్, అడ్డా టివి, హాట్‌ఎక్స్ విఐపి, హల్‌చల్ యాప్, మూడ్‌ఎక్స్, నియాన్‌ఎక్స్ విఐపి, ఫ్యుగి, మోజ్‌ఫిక్స్, ట్రైప్లిక్స్ వంటివాటిని నిషేధించారు.దేశంలో అశ్లీల కంటెంట్‌పై నిషేధం ఉన్న సంగతి తెలిసిందే. అయితే ఏదో ఒక మార్గంలో ఆ కంటెంట్‌ని ప్రసారం చేస్తున్నారు కొందరు. కొందరైతే.. అశ్లీల కంటెంట్ కోసం ఏకంగా యాప్స్‌ని తయారు చేసి.. దాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారు.

## ఉమ్మడి పది జిల్లాలకు ప్రత్యేక అధికారుల నియామకం

**హైదరాబాద్,నేటి ప్రభాత సూర్య :** తెలంగాణలోని పది ఉమ్మడి జిల్లాలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా సీ హరికిరణ్, కరీంనగర్ ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్, నిజామాబాద్ ప్రత్యేక అధికారిగా ఆర్ హన్మంతు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేకాధికారిగా డీ దివ్యను నియమించింది. మహబూబ్‌నగర్ ప్రత్యేక అధికారిగా రవి, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రత్యేక అధికారిగా శశాంక, మెదక్ జిల్లా ప్రత్యేక అధికారిగా ఏ శరత్, ఖమ్మం ప్రత్యేకాధికారిగా కే సురేంద్రన్, హైదరాబాద్ జిల్లా ప్రత్యేక అధికారిగా ఇలంబర్తికి బాధ్యతలు అప్పగించింది.

# కుల గణన హామీ నిలబెట్టుకున్న కాంగ్రెస్

- బిసి రిజర్వేషన్లను నీరుగార్చే కుట్రలో బిజెపి
- ఢిల్లీ సమావేశాల్లో అన్ని అంశాలు చర్చించాం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**న్యూఢిల్లీ- నేటి ప్రభాత సూర్య :**

ఢిల్లీలో అఖిల భారత నాయకత్వంతో కీలక సమావేశాలు జరిగాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. నిన్న ఖర్గే నివాసంలో తెలంగాణలో కులగణన, బీసీ రిజర్వేషన్లపై చర్చ జరిగింది.. భారత్ జోడో యాత్రలో అసమానతలు గమనించి కులగణన చేస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు.. కేంద్రంలో అధికారంలోకి రాకపోయినా.. తెలంగాణలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన కాంగ్రెస్ కుల గణన చేసింది అన్నారు. 56 ప్రశ్నలతో.. 150 ఇండ్లను ఒక బ్లాక్ గా చేసి, శాస్త్రీయ బద్ధంగా కులగణన చేశాం.. సర్వేలో మూడున్నర కోట్ల ప్రజలు స్వచ్ఛందంగా తమ సమాచారం ఇచ్చారు.. బీసీ రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో ఆమోదించిన బిల్లును గవర్నర్ కు పంపించాం.. రాష్ట్రపతి వద్ద పెండింగ్ లో ఉంది.. దేశవ్యాప్తంగా కులగణన చేయాలని కాంగ్రెస్ ఆలోచిస్తుంది.. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేలతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎంపీలకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చాం.. తెలంగాణ భవిష్యత్ నిర్మాణానికి అద్భుతమైన సర్వేను సిద్ధం చేశారనీ అగ్రనాయకులు చెప్పారని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. ఇక, బీజేపీ అభ్యంతరాలు చెప్పాలనుకుంటే అసెంబ్లీలోనే లెవనెత్తాల్సింది.. ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చ జరుగుతుంటే బీజేపీ నేతలు భయపడుతున్నారని మంత్రి పొన్నం ఎద్దేవా చేశారు. కిషన్ రెడ్డి జాగ్రత్త.. ప్రతిపక్ష నాయకుడిగా బీజేపీ బీసీకి అవకాశం ఇవ్వలేదు.. బండి సంజయ్ ను తొలగించి.. కిషన్ రెడ్డి ప్రెసిడెంట్ అయ్యారు.. తెలంగాణలో కమలం పార్టీ గెలిచే అవకాశం లేదు.. బీఆర్ఎస్ తో కుమ్మక్కై రాష్ట్రంలో ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.. ముస్లీంల రిజర్వేషన్లు గురించి బీజేపీ మాట్లాడుతుంది.. ముందు మీరు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోముస్లీం రిజర్వేషన్లు తొలగించండి అని సవాల్ విసిరారు. బీజేపీ బీసీ రిజర్వేషన్లను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రారంభమయ్యే రిజర్వేషన్లు.. చట్ట సభల వరకు పోతాయన్నారు. బీజేపీ బీసీలకు వ్యతిరేకం.. వారిపై తిరుగుబాటు తప్పదు.. తెలంగాణలో బీజేపీ బ్రతకడానికి ఎంఐఎం జపం చేస్తుంది.. ఎంఐఎం, బీజేపీ జపం చేస్తుందని పొన్న ప్రభాకర్ విమర్శించారు.

## సోనియా లేఖ ఆస్కార్ లాంటిదని అనడం దారుణం

- తెలంగాణ ఆత్మగౌరవం రేవంత్ తాకట్టు
- మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద



**హైదరాబాద్,నేటి ప్రభాత సూర్య :**

బీసీ రిజర్వేషన్ల అంశం, సోనియా లేఖపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్యే పట్నం వివేకానంద, బీఆర్ఎస్ నేత క్యామ్ మల్లేశ్ బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో రేవంత్ వ్యాఖ్యలను ఘాటుగా తప్పుబట్టారు. ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి సోనియా గాంధీ రాసిన లేఖను తనకు ఆస్కార్ లాంటిదని రేవంత్ ప్రజలను తప్పు దోవ పట్టిస్తున్నారన్నారు. అందులో ఆమె కేవలం పవర్ పాయింట్ సమావేశానికి తాను హాజరు కాలేనన్న అంశాన్ని మాత్రమే ప్రస్తావించిందని పేర్కొన్నారు. సీఎం రేవంత్ గాంధీ కుటుంబానికి చిరునవ్వులు పండించే ప్రయత్నంలో ప్రజల ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టారని ధ్వజమెత్తారు. బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. సీఎం రేవంత్ అసత్యాలతో బీసీలకు 42 రిజర్వేషన్లు సాధ్యం కాదని తెలిసి కూడా ప్రజలను మభ్యపెడుతున్నారు. ఆయన నటనకు ఆస్కార్ అవార్డు ఇవ్వాల్సిందే, లేకపోతే భాస్కర్ అవార్డు అయినా ఇవ్వొచ్చు అన్నారు. ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్‌ను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని ఆయన అన్నారు. సీఎం రేవంత్ లాగా బ్యాగులు మోసి రాజకీయాల్లో పైకి రాలేదని, ప్రజాసేవతోనే మేము రాజకీయాల్లోకి వచ్చాం అని అన్నారు. ఇక బీఆర్ఎస్ నేత క్యామ్ మల్లేశ్ మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి అబద్ధాల ద్వారా అధికారంలోకి వచ్చారు. అటువంటి వారికి ఆస్కార్ అవార్డు ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ వ్యాఖ్యలు బీసీలను, సామాజిక గౌరవాన్ని అవమానించడమేనని వ్యాఖ్యానించారు. సీఎం రేవంత్ రెడ్డి, చేపలు పట్టేవారిని మంత్రి చేశాను, బట్టలు ఉతికేవారిని ఎమ్మెల్యే చేశానన్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కేటీఆర్ వ్యక్తిత్వంపై కాంగ్రెస్ నాయకులు దూషణలు చేస్తున్నారని మల్లేశ్ మండిపడ్డారు. కేటీఆర్ హీరోయిన్లకు ఫోన్ చేస్తుంటే, మీరు డోర్ దగ్గర కావలిచేస్తున్నారా..? అంటూ కౌంటర్ వేశారు. అలాగే పార్టీ మారిన నేతలపై కూడా మల్లేశ్ తీవ్రంగా స్పందిస్తూ.. అలాంటి పిచ్చికుక్కలను తొండలెక్కించి కొట్టాలి.. రేవంత్ కూడా భవిష్యత్తులో వారిపై వాత పెడతాడన్నారు.

## పాఠశాల నిధులు స్వాహా చేస్తున్న ప్రిన్సిపాల్!

- మర్రిగూడ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ నిర్వాకం
- ప్రిన్సిపాల్ విద్యార్హతలపై అనుమానాలు



**మర్రిగూడ-నేటి ప్రభాత సూర్య:**

పాఠశాలలో విద్యార్థులకు అన్ని వసతులు కల్పించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. ఆ నిధులు కొందరు అవినీతి ప్రిన్సిపాల్స్ మింగేస్తున్నారు. ప్రశ్నిస్తే...విలేకర్లనే బెదిరిస్తున్నారు. పాఠశాలలో విద్యార్థులు అవస్థలు పడుతున్నా...పట్టించుకోవడంలేదు. అంతేకాకుండా విద్యార్థుల భోజనానికి అందించే సన్నబియ్యం కూడా పక్కదారి పట్టించారని ఆరోపణలు ఉన్నాయి. ఇలా ఒకటేమిటీ ఎన్నో అక్రమాలు, అవినీతిలో ఆ ప్రిన్సిపాల్ మునిగిపోయారని అనేక ఫిర్యాదులు అందుతున్నాయి. మర్రిగూడ మోడల్ స్కూల్ కు ప్రభుత్వం నుంచి వచ్చిన నిధులు పక్కదారి పడుతున్నాయి. ఇదే అంశంపై మర్రిగూడ మాజీ ఎంపీపీ, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు అనంతరాజు గౌడ్ శుక్రవారం డైరెక్టర్ పాఠశాల విద్యాశాఖ, రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్, సమగ్ర శిక్ష తెలంగాణ ఇ. నవీన్ నికోలస్ ఐపీఎస్ కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో పలు అంశాల గురించి, జరిగిన అవినీతి అక్రమాల గురించి పేర్కొన్నారు.

మర్రిగూడ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ శివస్వరూపారాణి అవినీతి చిట్టాను అధికారులకు వివరించారు. అనంతరాజు గౌడ్ మాట్లాడుతూ, మోడల్ స్కూల్ లో పరిశుభ్రత కరువైందన్నారు. మధ్యాహ్నం పిల్లలకు పెట్టే సన్నబియ్యం పక్కదారి పడుతుందని, గతంలో ప్రిన్సిపాల్ ఇదే తంతు ఆరోపణలు వచ్చి, ఉన్నత అధికారులు చర్యలు తీసుకున్నారన్నారు. శివ స్వరూపారాణి ప్రిన్సిపల్ గా రాకముందు, స్కూల్ ఖాతాలో 40 లక్షల రూపాయలు ఉన్నాయని, వాటిని లెక్కా పత్రాలు లేవని ఆరోపించారు. నాలుగు లక్షల సిపిఎస్ ఇంట్రెస్ట్ డబ్బులు లెక్క తేలడం లేదన్నారు. అలాగే కంప్యూటర్ ఆపరేటర్ సురేష్ కు ప్రభుత్వం ఇచ్చిన కంప్యూటర్ విక్రయించారని ఆరోపించారు. 90 వేల రూపాయలు స్కావెంజర్ వేతనాలు, ఖాతాలో జమ అయినప్పటికీ వారికి వేతనాలు ఇవ్వకుండా, ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఒకేషనల్ ట్రైనర్ గా పనులు చేయని అన్వేష్ అనే ఓ వ్యక్తికి, జీతాల పేరుతో ప్రభుత్వ సొమ్మును దోచి పెట్టారని ఆరోపించారు. అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో పదకొండు లక్షల రూపాయలను మింగేశారని అన్నారు. అలాగే ప్రిన్సిపల్ శివస్వరూపారాణి విద్యార్హతలపై అనేక అనుమానాలు ఉన్నాయని, ఆమె సర్టిఫికెట్లను సంబంధిత అధికారులు వెరిఫై చేయాలన్నారు.

## సరిహద్దులో పేలిన ల్యాండ్ మైన్

**పేలుడు ధాటికి జవాన్ మృతి**

**శ్రీనగర్, నేటి ప్రభాత సూర్య :** జమ్మూ కాశ్మీర్‌లో తీవ్ర విషాద ఘటన చోటు చేసుకుంది. పూంచ్ జిల్లాలోని నియంత్రణ రేఖ వెంబడి ల్యాండ్‌మైన్ పేలింది. మందు పాతర పేలుడు ధాటికి ఒక భారత జవాన్ మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. అధికారుల వివరాల ప్రకారం.. పూంచ్ జిల్లాలోని కృష్ణ ఘాటి ప్రాంతంలో శుక్రవారం (జూలై 24) రోజు మాదిరిగానే సైనికులు కుంబింగ్ నిర్వహించారు. ఈ క్రమంలోనే ఎప్పుడో అమర్చిన ల్యాండ్ మైన్ బ్లాస్ట్ అయ్యింది. పేలుడి తీవ్రతకు7 ఓఆ÷ రెజిమెంట్‌కు చెందిన అగ్నివీర్ జవాన్ లలిత్ కుమార్ ప్రాణాలు కోల్పోగా జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ తో సహా మరో ఇద్దరు గాయపడ్డారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించామని, చికిత్స కొనసాగుతోందని తెలిపారు. ప్రస్తుతం వారి హెల్త్ కండిషన్ నిలకడగానే ఉందని వెల్లడించారు. కాగా, జమ్మూ కాశ్మీర్‌లోని నియంత్రణ రేఖ వెంబడి ల్యాండ్‌మైన్ పేలుళ్లు కొత్తేమీ కాదు. 2025, మే నెలలో కూడా ఇలాంటి సంఘటనే ఒకటి చోటు చేసుకుంది. పూంచ్ జిల్లాలోని ఎల్‌ఓసీ వెంబడి ల్యాండ్ మైన్ పేలి ఓ జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. దిగ్వార్ సెక్టార్ లోని ఫార్వర్డ్ ప్రాంతంలో సైనికులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఈ దుర్ఘటన జరిగింది.

## ఏసీబీ వలలో మరో అవినీతి అధికారి.

**రాజేంద్రనగర్ జిహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ అరెస్ట్**

**హైదరాబాద్ - నేటి ప్రభాత సూర్య :**

తెలంగాణలో ఏసీబీ దాడులు ఎప్పటికీ అప్పుడు కొనసాగుతున్నా.. అధికారుల అవినీతి మాత్రం ఆగడం లేదు. తాజాగా మరో అధికారి ఏసీబీ అధికారులకు చిక్కారు. రాజేంద్రనగర్ జిహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ రవి కుమార్ పట్టుబడ్డారు. ఓ హోటల్ యజమాని నుంచి రవికుమార్ రూ. 2లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. రవి కుమార్ ఓ హోటల్ యజమాని నుంచి 5 లక్షలు డిమాండ్ చేయగా... రూ. 2లక్షలకు డీల్ కుదుర్చుకున్నట్టు సమాచారం. ఐతే ఆ డబ్బు లంచంగా తీసుకుంటుండగా ఏసీబీ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంది. ఆకస్మికంగా ఆఫీసులో తనిఖీ చేయగా.. ఈ నగదుతో రవి కుమార్ పట్టుబడ్డారు.

# అక్రమ మైనింగ్ కేసులో శ్రీలక్ష్మికి చుక్కెదురు

**రివిజన్ పిటిషన్‌ను కొట్టేసిన తెలంగాణ హైకోర్టు**

హైదరాబాద్, నేటి ప్రభాత సూర్య : ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి తెలంగాణ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తనను నిర్దోషిగా ప్రకటించాలంటూ ఆమె ఉన్నత న్యాయస్థానంలో రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. ఓఎంసీ కేసులో శ్రీలక్ష్మిని న్యాయస్థానం ఇప్పటికే నిందితురాలిగా తేల్చింది. కోర్టు తీర్పుతో ఆమె పాత్రపై సీబీఐ విచారణ జరపనుంది. ఓబుళాపురం మైనింగ్ కేసులో వై.శ్రీలక్ష్మి దాఖలు చేసిన డిశ్చార్జి పిటిషన్‌ను 2022 అక్టోబరులో సీబీఐ కోర్టు కొట్టేసింది. దీన్ని సవాలు చేస్తూ ఆమె తెలంగాణ హైకోర్టులో రివిజన్ పిటిషన్ దాఖలుచేశారు. ఉమ్మడి ఎపిలో 2006లో శ్రీలక్ష్మి పరిశ్రమల శాఖ కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన తరువాతే ఓఎంసీ మైనింగ్ లీజ్ వ్యవహారం ముందుకు సాగిందని సీబీఐ తరఫు న్యాయవాది హైకోర్టులో వాదించారు. ఓఎంసీ లీజులు కట్టబెట్టడానికి అమె అన్ని రకాలుగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని సీబీఐ తెలిపింది. ఈ కేసులో ఆరో నిందితురాలైన శ్రీలక్ష్మి.. వాస్తవాలను తొక్కిపెట్టి మరోసారి ఇక్కడ పిటిషన్ దాఖలు చేశారంటూ తెలంగాణ హైకోర్టుకు సీబీఐ నివేదించింది. గతంలో దీనిపై విచారించిన ఉన్నత న్యాయస్థానం.. శ్రీలక్ష్మి పిటిషన్‌ను అనుమతించింది. ఆమెను కేసు నుంచి తప్పిస్తూ తీర్పు వెలువరించింది. దీంతో సీబీఐ సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. సీబీఐ వాదన వినకుండా ఉత్తర్వులు జారీచేయడం సరికాదని అభిప్రాయపడింది. ఇరుపక్షాల వాదనలను పరిగణనలోకి తీసుకుని తాజాగా విచారణ చేపట్టాలంటూ ఈ పిటిషన్‌ను తిరిగి హైకోర్టుకు పంపింది. దీన్ని మూడు నెలల్లో తేల్చాలని ఆదేశించింది. గతంలో ఇదే కేసులో ఆమె పిటిషన్లను ఈ హైకోర్టు కొట్టేసిందని తెలిపింది. ఈ విషయాన్ని ప్రస్తుత రివిజన్ పిటిషన్‌లో ప్రస్తావించకుండా మరోసారి పిటిషన్ దాఖలు చేశారంది. ఓఎంసీకి లీజుల మంజూరులో అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు స్పష్టమైన ఆధారాలున్నాయని, కింది కోర్టులో విచారణను ఎదుర్కోవాల్సిందేనని తెలిపింది. సీబీఐ వాదనలను పరిగణలోకి తీసుకున్న హైకోర్టు శ్రీలక్ష్మి పిటిషన్‌ను తోసిపుచ్చింది.



# సంపాదకీయం

## సమస్యలపై చర్చించే చిత్తశుద్ధి ఏదీ !

పార్లమెంటులో సమస్యపై ఎలా చర్చించాలన్న వ్యూహం కనబడడం లేదు. తాము వాయిదా తీర్మానాలు ఇస్తే చర్చ జరగాల్సిందే అన్న ధోరణిలో విపక్షలు ఉన్నాయి. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో ఇది కుదరదు. వాయిదా తీర్మానాలు లేకున్నా అసవరమైన సందర్భాల్లో రూల్ పొజిషన్‌ను బట్టి సమస్యలపై చర్చకు అవకాశం ఉంది. దీనిని ఉపయోగించుకోవడంలో విపక్షాలు విఫలం అవుతున్నాయి. ఎందుకంటే ఐదురోజులుగా పార్లమెంట్ ఎలాంటి కార్యలాపాలు లేకుండా సాగుతోంది. అనేక అంశాలు చర్చించాల్సి ఉంది. వారు కోరుకుంటున్న బీహార్ ఓటర్ల జాబితాయే గాకుండా అనేక అంశాలు ఉన్నాయి. వాటిని ఎలా చర్చించాలో ప్రణాళిక లేకుండా పోతోంది. తమ గొంతు నొక్కుతున్నారని విపక్షనేత రాహుల్ చెప్పడం సిగ్గుచేటు. రూల్ ప్రకారం పోతే ప్రభుత్వమే దిగివస్తుంది. వచ్చినట్లు అంశం ఏదైనా చర్చిస్తారు. సమాధానం ఇస్తారు. అలా చేయడంలో విపక్ష పార్టీలు విఫలం అవుతున్నాయి. కేవలం వాయిదా తీర్మానాలు ఇవ్వడం, సభను అడ్డుకోవడం, బయటకు వచ్చి మీడియాతో మాట్లాడడం మాత్రమే చేస్తున్నారు.

నిజానికి జాతీయ జలవిధానం, నదుల అనుసంధానం, రైతుల సమస్యలు చర్చించడానికి సమయం కావాలి. వీటిని ఎజెండగా చేసుకోవాలి. రైతుల సమస్యలను పట్టించుకునే దిశగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఏటా ఒక విధానంగా గాకుండా, రుణ మాఫీలు అవసరం లేని విధంగా రైతులు స్వయం సమృద్ధిగా ఎదిగేలా చేయాలి. విత్తనాలు, పురుగు మందుల వ్యాపారస్థులు నకిలీలతో రైతులను నిలువునా ముంచుతున్నారు. అధికారులు చోద్యం చూస్తున్నారు. బ్యాంకు అధికారులు, ఏజెంట్లు కలిసి రైతులకిచ్చే ఋణాలలో కోత పెడుతున్నారు. అడ్తిదారులు, కమీషన్ ఏజెంట్లు, మార్కెట్ అధికారులు, అంతిమంగా అందరూ రైతులను ముంచడానికే సిద్ధంగా ఉంటున్నారు. రైతుల సమస్యలు రాజకీయ పక్షాలకు ప్రచార కార్యక్రమంగానే మిగిలిపోయాయి. పాలకపక్షం అయినా, ప్రతిపక్షం అయినా రైతుల సమస్యలను పరిష్కరించడానికి చిత్తశుద్ధితో ఆలోచించడం లేదు. గిట్టుబాటు ధరలు లేక వచ్చిన ఆదాయం కూలీల ఖర్చుకు సరిపోతుంది. లక్షలాది మంది రైతులు వర్షాలు కురిసి కాలం కలసివచ్చినా ధరలు రాక నష్టపోతున్నారు. వీటికితోడు భారీ వర్షాలు దేశాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. వర్షాల ద్వారా మనం పాఠాలు నేర్చుకోవాలి. వరదలను నివారించి, నీటిని నిల్వ చేసుకునే పద్ధతలను అవలంబించాలి.

దేశవ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు వాగులు వంకలు పొంగుతున్నాయి. జలాశయాలు నిండుకుండల్లా మారాయి. ప్రాజెక్టుల నుంచి నీరు విడుదల చేయడంతో మళ్లీ సముద్రంలోకి నీరు చేరు తోంది. ముందస్తు ప్రణాళికలు లేకపోవడంతో దేశంలో నీటి యాజమాన్యం సరిగా లేదని ఏటా కురుస్తున్న వర్షాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికితోడు అనేక జలాశయాల్లో పూడిక పేరుకుని పోతోంది. ఏటేటా వర్షాలతో ఒండ్రు చేరుతోందని నిపుణులు చెబుతున్నారు. ఉత్తరాదిలో అనేక నదులు ఉప్పొంగాయి. చివరకు మళ్లీ నీరు సముద్రానికి చేరింది. తాజాగా కూడా అలాంటి పరిస్థితిని చూస్తున్నాం. ఇప్పటికైనా పాలకులు జాతీయ జలవిధానం రూపొందించాల్సి ఉంది. పార్లమెంటులో ఇలాంటి సమస్యలు చర్చకు రావడం లేదు. ఎంతసేపు ఓటు బ్యాంక్ రాజకీయాలు తప్ప సమస్యలపై ఎంపిలకు అవగాహన లేకుండా పోతోంది. అలాగే వర్షాలతో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారిని ఆదుకునే ప్రయత్నం చేయాలి. వ్యవసాయం పై కూడా జీతాయ విధానంతో ముందుకు సాగాలి. వ్యవసాయాన్ని లాభసాటి చేసేలా, దిగుబడులు తగ్గించుకుని మన రైతులను ప్రోత్సహిచేలా చూసుకోవాలి. వివిధ రాష్ట్రాల్లో చెరువులను మింగిన పాపానికి ఇటీవల కురిసిన వర్షాలకు నగరాలు, పట్టణాలు, గ్రామాలు నీట మునిగాయి. ఇదంతా పాలకుల పాపం కాక మరోటి కాదు. ఈ క్రమంలో గొలుసుకట్టు చెరువులను రక్షించు కోవాలి. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకుని కనీసం ఇప్పటి నుంచయినా నీటి అవసరాలను గుర్తించి పొదుపు చేయడం అలవాటు చేసుకోవాలి.

వ్యవసాయ ఉత్పత్తులను పెంచి విదేశాలకు ఎగుమతులు చేసే విధంగా సన్నద్ధం కావాలి. ఆర్థికమాంద్యం ముంచుకొస్తున్న వేళ కేంద్రం ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలి. వ్యవసాయ రంగం పురోగమిస్తే, ధాన్యం దిగుబడులు తగ్గితే తప్ప భారత ఆర్థికరంగం పురోగమించదు. ఇప్పటికే వరిధాన్యం ఇబ్బడి ముబ్బడిగా పండించడం వల్ల గోదాముల్లో మగ్గి పోతోంది. వాటిని వాడుకునే విధంగా కార్యక్రమాలు అమలు చేసుకోవాలి. అదేపనిగా వరి పండించకుండా ఇతర పంటలపైనా ప్రోత్సాహం కల్పించాలి. ఆధునిక వ్యవసాయం దిశగా పురోగమించాలి. నిరుద్యోగం పెరిగడంతో.. ప్రజలు ఉపాధి కోసం ఎదురు చూస్తున్నారు. వారిని వ్యవసాయం వైపు మళ్లించేలా పథకాలు చేపట్టాలి. తక్షణ ఉపాధికి ఇదొక్కటే ప్రత్యామ్నాయం కాగలదు. దీంతో ఆహార ఉత్పత్తులు కూడా పెరగ గలవు. కరువులు వచ్చినా, అధికంగా వర్షాలు కురిసినా రైతుల దుర్భర పరిస్థితులలో ఎలాంటి మార్పూ కనిపించడం లేదు. మరోవైపు ప్రతి సంవత్సరం వేలాది మంది రైతులు పట్టణాలకు వలస వెళ్ళి దినసరి కూలీలుగా మారుతున్నారు. ప్రధానంగా అనేకరకాల పప్పు ధాన్యాలు, వంట నూనెల దిగుమతులను పూర్తిగా నిషేధించుకుని, దేశీయంగా పండించుకునేలా వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి. రైతులనే ప్రోత్సహించి పంటలనే కాపాడుకునేలా రైతాంగ విధానాలపై చర్చ చేయాలి. రైతులకి మేలు చేస్తానన్న ప్రభుత్వాల ప్రకటనలు ఆచరణలోకి రావడం లేదు. అంతెందుకు రైతులకు గిట్టుబాటును మించి ధరలు దక్కేలా చేస్తామన్న ప్రధాని మోడీ వాగ్దానాన్ని నెరవేర్చగలగాలి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయాలు అనేక రెట్లు పెరిగిపోవడంతో పాటు విత్తనాల దగ్గర నుంచి నకిలీలు రైతులను కుంగదీస్తున్నాయి. ఈ విధానాలనే పార్లమెంటులో చర్చించడం లేదు. రాజకీయ పార్టీల ప్రాధాన్యాలు మారాలి. ప్రజల సమస్యలను ఎంచుకున ముందకు సాగితేనే మంచిది.

# ఆన్‌లైన్లోనే శ్రీవారి దివ్యానుగ్రహ టిక్కెట్లు

### శ్రీవారి దర్శనం కోసం డబ్బులు వసూలు చేసిన ముఠా పట్టివేత

**తిరుమల :** శ్రీవారి భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం కీలక సూచన చేసింది. తిరుపతి అలిపిరిలోని సప్త గో ప్రదక్షిణ మందిరంలో ప్రతీరోజు నిర్వహించే శ్రీ శ్రీనివాస దివ్యానుగ్రహం టికెట్లను ఇకపై ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేస్తామని టీటీడీ స్పష్టం చేసింది. ఇది ఆగస్టు 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని తెలిపింది. ప్రతి రోజు 200 టికెట్లు- మాత్రమే ఆన్‌లైన్‌లో జారీ చేయాలని నిర్ణయించినట్లు- వివరించింది. ఈ విషయాన్ని శ్రీవారి భక్తులు గమనించాలని సూచించింది. ఈ టికెట్ల ద్వారా రూ.1600/చెల్లించి గృహస్తులు (ఇద్దరు) విశేష హోమంలో పాల్గొనవచ్చని పేర్కొంది. హోమంలో పాల్గొన్న గృహస్తులకు రూ.300/ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పిస్తారని తెలిపింది. అయితే గతంలో ప్రతీ రోజు భక్తులకు కరెంటు- బుకింగ్ ద్వారా 50 టికెట్లు-, ఆన్‌లైన్‌లో 150 టికెట్లు- జారీ చేసే వారు. ఇదిలావుంటే తిరుమలలో శ్రీవారి సర్వదర్శనం సులభంగా చేయిస్తామంటూ కొందరు దళారులు ముఠాగా ఏర్పడ్డారు. ఆ ముఠా గుట్టు-ను టీటీడీ విజిలెన్స్ అధికారులు రట్టు చేశారు. శ్రీవారి దర్శనం కోసం క్యూలైన్‌లో నిలబడకుండా నేరుగా స్వామివారి ఉచిత దర్శనం ఏర్పాటు- చేయిస్తామంటూ ఈ రు ముఠా.. దాదాపు 25 మంది భక్తుల నుంచి ఒక్కొక్క భక్తుడి నుంచి రూ.1500 వసూల్ చేసింది. అనంతరం భద్రతా సిబ్బందితో ఈ ముఠా కుమ్మక్కై. వారికి స్వామివారి దర్శనం చేయించినట్లు- విజిలెన్స్ విభాగం గుర్తించింది. ఈ ముఠా సభ్యులతోపాటు- భద్రతా సిబ్బందిని అదుపులోకి తీసుకున్న టీటీడీ విజిలెన్స్ విభాగం దర్యాప్తు చేస్తోంది.



# వ్యవసాయం అతిపెద్ద ఉత్పాదక రంగం


### దానిని ప్రోత్సహిస్తే ఆర్థిక పురోగతి



**న్యూఢిల్లీ, నేటి ప్రభాత సూర్య :** స్వవిప్లవానికి నాంది పలికేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలకు పూనుకోవాల్సిన అవసరం ఉంది. వ్యవసాయ రంగ నిపుణులు ఇదే అభిప్రాయ పడుతున్నారు. నిరుద్యోగులు గ్రామాలకు తరలాలని, వారిని ఆదరించి వ్యవసాయం వైపు మళ్లించాలని అన్నారు. అలా చేయడం వల్ల వ్యవసాయంరంగం అతిపెద్ద ఉత్పాదక రంగంగా మారగలదని అన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు పెంచితే మంచిదని అంటున్నారు. బహుళజాతి కంపెనీలకూ ఎర్ర తివాచీలు పరుస్తున్న ప్రభుత్వాలు రైతులను అనుత్పాదక రంగాలుగా చూస్తున్న తీరు దారుణం కాక మరోటి కాదు. రైతులను ఓటు బ్యాంకుగా చూడకుండా మనకు పట్టెడు అన్నం పెట్టే తల్లిగా చూసుకోవాలి. ఇక పోతే విదేశాల నుంచి నూనెల దిగుమతి వేరుశనగ రైతులకు శరాఘాతంగా మారింది. పంటల విధానంలో శాస్త్రీయ దృక్పథం లోపించడం, సేంద్రియ ఎరువుల బదులు రసాయన ఎరువులు వాడడం వల్ల భూమి సారం తగ్గుతోంది. ఏ పంటపండించినా గిట్టుబాటు ధరలు లభించడం లేదు. రైతులని కాపాడుకుని, వ్యవసాయాన్ని పండగ చేస్తామంటున్న ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలి. చిత్తశుద్ధితో పనిచేసే వ్యవస్థను రూపొందిం చాలి. ఈ ఆధునిక ఆర్థిక వ్యవస్థలో రైతుల సమస్యలు మరింత జఠిలం అవుతున్నాయే తప్ప పరిష్కారం కావడం లేదు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు స్పష్టమైన వ్యవసాయిక విధానం లేకపోవడం రైతుల పాలిట శాపంగా మారిపోయింది. ఫ్రీ మార్కెట్ అనేది ఒక అభూత కల్పన మాత్రమే అయ్యింది. దేశ ఆర్థిక వ్యవస్థ 8నుంచి 9శాతం వరకూ వృద్ధి జరుగుతున్న ప్పటికీ, వ్యవసాయ ఉత్పత్తులు పెరుగుతన్నా రైతుల ఆర్థిక వ్యవస్థ మాత్రం బాగుపడడం లేదు. ఇబ్బడిముబ్బడిగా ఆహారధాన్యాలను దిగుమతి చేసుకోవడం కూడా రైతులకు శాపంగా మారింది. కల్తీలు కూడా రైతును కాటేస్తున్నాయి. మన అసవరాలకు సరిపడా కందులు, మిరప, ఇతర పంటలను రైతులు చెమటోడ్చి పండించినా వాటిని కొనుగోలు చేయడం లేదు. ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాల దిగుబడి తక్షణం ఆగిపోవాలని అన్నారు. ఆర్థిక పునరుత్తేజానికి, వృద్ధిరేటును పెంచడానికి నవతరం సంస్కరణలు అవసరమని తెలిపారు. విద్యుత్తు, బ్యాంకింగేతర ఆర్థిక సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ)ల రంగాల సమస్యలు సత్వరం పరిష్కరించాల్సి ఉందని, ప్రైవేటు పెట్టుబడులు పెరిగేందుకు సరికొత్త సంస్కరణలు అవసరమని తెలిపారు. ప్రైవేటు రంగ విశ్లేషకుల నుంచి వృద్ధిరేటు అంచనాలు వేర్వేరుగా ఉంటున్నాయని, వీటిల్లో చాలావరకు ప్రభుత్వ అంచనాల కంటే తక్కువగా ఉంటున్నాయని గుర్తు చేశారు. ఆర్థిక వ్యవస్థ మందగమనం తీవ్ర ఆందోళనకరమని, పరిష్కారానికి నూతన సంస్కరణలు అవసరమని నిపుణుల హెచ్చరికలు పట్టించుకోవడం లేదు. విద్యుత్తు, ఎన్‌బీఎఫ్‌సీ రంగాల్లో సత్వరం సమస్యలు పరిష్కరించాలి. ప్రైవేటు రంగం నుంచి పెట్టుబడులు వచ్చేలా దీర్ఘకాలిక దృక్పథం కలిగిన సంస్కరణలూ కావాలి. ప్రోత్సాహకాలు, ఉద్దీపనలు తాత్కాలికంగా మాత్రమే ఉపకరిస్తాయి. ఇప్పుడు మెరుగైన విధానం కాదు, ప్రత్యేక విధానం కావాలి.

# శ్రావణమాసం ఆరంభం

**నేటి ప్రభాత సూర్య - ఇంటర్‌నెట్ డెస్క్:** తెలుగు మాసాల్లో ఐదో మాసం శ్రావణ మాసం. శ్రావణ మాసం వర్ష ఋతువులో వస్తుంది.. కనుక విరివిగా వర్షాలు కురుస్తాయి. ఈ నెల హిందువుల లోగిళ్ళు ఆలయాలను తలపిస్తాయి. విష్ణువు, లక్ష్మీదేవులకు అత్యంత ఇష్టమైన మాసం శ్రావణ మాసం.. ఈ నెలలో మహిళలు వ్రతాలు, నోములు, పూజలను ఆచరిస్తారు. ఈ నెలలో ఆచరించే పూజల వలన విశేష ఫలితాలు లభిస్తాయని పెద్దల చెబుతారు. పౌర్ణమి రోజున చంద్రుడు శ్రవణ నక్షత్రంలో ఉంటాడు. కనుక ఈ మాసానికి శ్రావణ మాసం అని పేరు వచ్చింది. శ్రీమహావిష్ణువు జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం. ఈ నక్షత్రం పేరుతొ ఏర్పడిన శ్రావణమాసం అని, ఈ మాసంలో చేసే పూజలు అత్యంత ఫలప్రదమని పురాణాల కథనం. లక్ష్మీ ప్రదమైన మాసం.. శ్రావణ మాసం ఈ ఏడాది జూలై 25 వ తేదీ శుక్రవారం నుంచి ప్రారంభం అయ్యింది. శ్రావణ మాసం వచ్చిందంటే చాలు మహిళలు ఆనందిస్తారు. తొలిరోజే శుక్రవారంతో ప్రారంభం కావడం విశేషం. ఇకపోతే శ్రావణం ప్రధానంగా వ్రతాలు, నోములకు ప్రసిద్ధి. మంగళవారం మంగళగౌరి వ్రతం. మంగళవారం రోజున ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. పార్వతి దేవికి మరొక పేరు గౌరీ దేవిని పూజిస్తారు. ముఖ్యంగా కొత్తగా పెళ్ళయిన వధువులు.. తప్పనిసరిగా ఈ వ్రతాన్ని చేస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల మహిళలు నిండు ముత్తయిదువులుగా జీవిస్తారని ప్రతీతి. ఈ మాసంలో శ్రీ వరలక్ష్మీ దేవిని పూజిస్తూ.. ప్రతి శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తారు. ముఖ్యంగా పూర్ణిమ ముందు వచ్చే శుక్రవారం రోజున మహిళలు వరలక్ష్మీవ్రతాన్ని ఆచరిస్తారు. ఈ రోజున వరలక్ష్మీ దేవతను పూజిస్తే అష్టలక్ష్మీ పూజలకు సమానమని నమ్మకం. అంతే కాదు ఈరోజున లక్ష్మీదేవిని పూజిస్తే అష్టయిశ్వర్యాలైన సంపద, భూమి, శిక్షణ, ప్రేమ, కీర్తి, శాంతి, సంతోషం, శక్తి వంటివి లభిస్తాయని ప్రగాఢ విశ్వాసం. లక్ష్మీదేవి అనుగ్రహంతో కుటుంబం సుఖ సంతోషాలతో నెలకొంటుందని విశ్వాసం. దీపావళి తర్వాత జరుపుకొనే నాగులచవితి లాగ.. కొన్ని ప్రాంతాల్లో నాగుల పంచమిని జరుపుకుంటారు. ఈ రోజున నాగులకు పూజలను నిర్వహిస్తారు. పుట్ట వద్దకు వెళ్ళి పాలు పోసి, నాగ దేవతను పూజిస్తారు. ఉపవాసం ఉంటారు. శ్రావణశుద్ధ ఏకాదశిని పుత్రదా ఏకాదశి లేదా లలిత ఏకాదశి అంటారు. సంతానం లేనివారు వ్రతాన్ని ఆచరించడం శుభఫలితాను ఇస్తుంది. ప్రాంతాల వారు హయగ్రీవ జయంతిగా జరుపుకుంటారు. అయన అనుగ్రహం కోసం పూజలు నిర్వహించి.. శనగలు, ఉలవలతో గుగ్గిళ్ళు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు. తుంగభద్రానది తీరంలో మంత్రాలయంలో కొలువైన శ్రీ గురు



### వ్రతాలు, నోములకు పెద్దపీట

అంతేకాదు ఈరోజున గొడుగు దానమిస్తే విశేష ఫలితాన్ని పొందవచ్చని పురాణాలు పేర్కొన్నాయి. శ్రావణ రాఖీపూర్ణిమ లేదా జంధ్యాల పౌర్ణమి రోజు తన సోదరిని మేలు కోరుతూ సోదరి.. సోదరుని చేతికి రాఖీ కట్టే పండుగే ఈ రాఖీ పూర్ణిమ. అన్నదమ్ములకు రాఖీ కట్టి, నుదుట బొట్టు పెట్టి అనంతరం మిఠాయిలను తినిపిస్తారు. సోదరుడు సోదరిని ఆశీర్వదించి కానుకలివ్వడం ఆనవాయితీ. దీనినే జంధ్యాల పౌర్ణమి అని కూడా అంటారు. యజ్ఞోపవీతాన్ని విసర్జించి కొత్తది ధరించడం ఆచారం. అందుకనే ఈ పౌర్ణమిని జంధ్యాల పూర్ణిమ అని కూడా అంటారు. శ్రావణ పున్నమి రోజున శ్రీమహావిష్ణువు వేదాలను రక్షించడం కోసం హయగ్రీవ రూపం ధరించినట్లు పురాణాలు పేర్కొన్నాయి. అందుకనే ఈరోజున కొన్ని రాఘవేంద్రస్వామి జయంతి వేడుకలను శ్రావణ కృష్ణ విదియరోజున ఘనంగా నిర్వహిస్తారు. దుష్టశిక్షణ.. శిష్టరక్షణ కోసం శ్రీ మహావిష్ణువు ఎత్తిన ఎనిమిదో అవతారమే శ్రీకృష్ణ అవతారం. శ్రీకృష్ణపరమాత్మ జన్మించిన రోజు శ్రీకృష్ణాష్టమి. ఈరోజుని కృష్ణాష్టమిగా దేశవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటారు. ఈరోజు ఉట్టికొట్టడం ఆచారం. ఈ మాసంలో బహుళ పక్షంలో వచ్చే ఏకాదశిని కామిక ఏకాదశి అని అంటారు. ఈరోజున నవనీతాన్ని (వెన్న) దానం చేయడం వలన ఆర్థిక ఇబ్బందులు తొలగుతాయని నమ్మకం. శ్రావణ మాసములో కృష్ణపక్ష అమావాస్యని పొలాల అమావాస్యగా పిలుస్తారు. సంతానం కోసం ఈరోజున మహిళలు ప్రత్యేక పూజను నిర్వహిస్తారు. ఈరోజున అమ్మవారిని పూజిస్తే.. పిల్లలు కలుగుతారని నమ్మకం.

## మంచిరోజులివే..



గురువారంతో ఆషాఢ మాసం వెళ్లిపోయింది. మహిళలు ఎంతో పవిత్రంగా భావించే శ్రావణమాసం శుక్రవారం నుండి ప్రారంభం అయ్యింది. ఈ సంవత్సరంలో మాసం తొలిరోజునే శుక్రవారం కావడంతో ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక శ్రావణంలో ఎన్నో పర్వదినాలు పలకరించనున్నాయి. నాగుల చవితి, మంగళగౌరీ వ్రతం, వరలక్ష్మీ వ్రతం, రాఖీ పౌర్ణమి రానున్నాయి. పౌర్ణమి నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు జరుగను న్నాయి. కృష్ణాష్టమి పర్వదినాలు రానున్నాయి. ఈ మాసమంతా వైష్ణవాలయాల్లో ఆధ్యాత్మిక శోభ వెల్లి విరుస్తుందనడంలో సందేహం లేదు. పూలమార్కె ట్లకు శ్రావణ శోభ వచ్చింది. ఆనందపురం మండ లంలోని వేములవలస రోజువారీ పూలమార్కెట్‌కు శ్రావణ శోభ సంతరించుకుంది. శుక్రవారం నుంచి శ్రావణమాసం ప్రారంభం కావడంతో మార్కెట్‌కు కొనుగోలుదారుల తాకిడి అధికమైంది. వరలక్ష్మి వ్రతానికి సంబంధించిన పూజా సామాగ్రిని కొనుగోలు చేయడానికి నగరం నుంచి మహిళలు అధిక సంఖ్యలో వస్తున్నారు. దీంతో మార్కెట్‌లో అమ్మకాలు జోరుగా ఊపందుకున్నాయి.

## ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే బొజ్జ, కలెక్టర్ దీపక్



**మంచిర్యాల, జులై 25 (నేటి ప్రభాతా సూర్య):జన్నారం** ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని తమ జీవితాల్లో అభివృద్ధి సాధించాలంటూ ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జ మరియు మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ పిలుపునిచ్చారు. శుక్రవారం జన్నారం మండలంలో నిర్వహించిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన రేషన్ కార్డులు, కళ్యాణలక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల క్రింద చెక్కులు పంపిణీ చేశారు. అలాగే గౌడన్నలకు కాటమయ్య రక్షణ కిట్లు అందజేశారు."ప్రజల మేలు కోసమే ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోంది. అందరూ వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి" అని వారు పేర్కొన్నారు.

## కవ్వాల్ అరణ్యంలో భారీ వాహనాలకు అనుమతించాలని ప్రజాప్రతినిధుల వినతి



**మంచిర్యాల జిల్లా.జన్నారం, జూలై 25 (నేటి ప్రభాతా సూర్య):** మంచిర్యాల జిల్లా కవ్వాల్ అభయారణ్యంలో భారీ వాహనాల రాకపోకలకు అనుమతించాలని కోరుతూ జన్నారం మండల ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అటవీ నియమావళి కారణంగా భారీ వాహనాలు నిషేధించబడి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. వన్యప్రాణి సంరక్షణను కాపాడుతూనే, ప్రజల జీవనోపాధికి గేట్ ఓపెన్ చేయాలన్న వారి అభిప్రాయాన్ని కలెక్టర్ ఎదుట ఉంచారు."అటవీ ఆంక్షలు కొంతవరకు సడలించి, నియంత్రిత విధానంలో భారీ వాహనాలకు అనుమతిస్తే, యువతకు ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంది" అని నాయకులు పేర్కొన్నారు.

## వారి నియామకాలపై హైకోర్టులో సవాల్




**హైదరాబాద్, నేటి ప్రభాతా సూర్య, జులై 25:** తెలంగాణ రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి (మంచిర్యాల్) చైర్మన్ జనక్ ప్రసాద్ మరియు సభ్యుల నియామకాలపై హైకోర్టులో సవాల్ ఎదురైంది. ఈ నియామకాలు చట్టవిరుద్ధమని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. పిటిషనర్ తరఫున ఐ ఎన్ టి యు సి (ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్) సభ్యులను ఎలా నియమించారని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు స్పందిస్తూ ప్రతివాదులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ కేసు పై పరిశ్రమలలో మినిమం వేతనాల సలహా విధానాల్లో పారదర్శకతపై చర్చకు తావు కలిగే అవకాశముంది.

## వన్ టౌన్ ఎస్.హెచ్.ఓ ను సత్కరించిన మాదిగ హక్కుల దండోరా నాయకులు




**మంచిర్యాల జిల్లా:నేటి ప్రభాతా సూర్య. జులై 25:** బెల్లంపల్లి 1 వ పట్టణ పోలీస్ స్టేషన్ కు నూతనంగా వచ్చిన ( ఎస్ హెచ్ ఓ ) సి ఐ శ్రీనివాస్ రావు ని మాదిగ హక్కుల దండోరా నాయకులు శాలువాతో, పూల పుష్పగుచ్ఛంతో ఘనంగా సత్కరించారు. మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షులు కాంపెల్లి రాజం మాదిగ బెల్లంపల్లిలో శాంతి భద్రతలు, పట్టణంలోని యువకులు మత్తు పదార్థాలకు, గంజాయికి బానిసలు కాకుండా యువ చైతన్యాన్ని రూపు దిద్దాలని, పలు సమస్యలపై ( సిఐ ) శ్రీనివాస్ తో చర్చించారు. సి.ఐ శ్రీనివాసరావు పలు సమస్యలపై సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర సీనియర్ నాయకులు అరకొండ శేఖర్ మాదిగ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నాతరి కిరణ్ మాదిగ, సీనియర్ నాయకులు, మాజీ కౌన్సిలర్ లింగంపల్లి రాములు మాదిగ, ప్రధాన కార్యదర్శి గద్దల కుమారస్వామి మాదిగ, పట్టణ ఉపాధ్యక్షుడు సిరికొండ మహేందర్ మాదిగ, కార్యదర్శి కడప శంకర్ మాదిగ, సీనియర్ నాయకులు మాజీ కౌన్సిలర్ సముద్రాల శ్రీనివాస్ మాదిగ, సీనియర్ నాయకులు కాంపెల్లి శంకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల వాటా వెంటనే చెల్లించాలి : ఏఐటీయూసీ డిమాండ్



**మందమర్రి, జూలై 25 (నేటి ప్రభాతా సూర్య):** సింగరేణి సంస్థలో కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. సంస్థ సీఈవో స్థాయి స్ట్రక్చర్ కమిటీ సమావేశంలో చర్చించిన అంశాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి సత్యనారాయణ స్పష్టం చేశారు. కార్మికులకు సొంతింటి కలను నెరవేర్చేలా సొంతింటి పథకంను అమలు చేయాలని, పెరిగిన వేతనాలపై ఇన్కమ్ టాక్స్ మార్క్‌ను హద్దుల్లో ఉంచాలని ఆయన కోరారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆర్జించిన లాభాల నుంచి కార్మికులకు రావాల్సిన వాటాను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే, మెడికల్ బోర్డు నిర్వహించి, అర్హత ఉన్న డిపెండెంట్లకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సూచించారు. కార్మికుల శ్రేయస్సు కోసం సంస్థ యాజమాన్యం సానుకూలంగా స్పందించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

## మంచిర్యాల జిల్లాలో నిలిచిన నల్లబంగారం ఉత్పత్తి

### భారీ వర్షాలతో సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల పనులకు తీవ్ర అంతరాయం



**నేటి ప్రభాతా సూర్య, జూలై 25:** మంచిర్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు సింగరేణి బొగ్గు గనుల్లో ఉత్పత్తి కార్యకలాపాలను గణనీయంగా ప్రభావితం చేశాయి. బెల్లంపల్లి రీజియన్ పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియా, ఇందారం, మందమర్రి కేకే ఓసిపి, బెల్లంపల్లి మరియు కైరిగూడ ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో బొగ్గు తవ్వకం, ఓబీ (ఓవర్ బర్డెన్) పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టుల్లో వర్షపు నీరు నిలిచిపోయి, రహదారులు బురదమయం కావడంతో డంపర్లు, ట్రక్కులు, ఇతర వాహనాలు నడిచే పరిస్థితి లేకుండా పోయింది. ఈ స్థితి బొగ్గు ఉత్పత్తిని నిలిపివేయడమే కాకుండా, ట్రాన్స్‌పోర్ట్‌కు కూడా తీవ్ర అంతరాయం కలిగిస్తోంది. పనులు నిలిచిన నేపథ్యంగా సంస్థకు ఆర్థిక నష్టం కలిగే అవకాశం ఉండగా, సమీప ప్రాజెక్టుల్లో మళ్లీ ఉత్పత్తి ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

## మంచిర్యాల టి.యు.డబ్ల్యూ.జె సమావేశం విజయవంతం

### సభ్యత్వ నమోదు, మీడియా భద్రతపై కీలక నిర్ణయాలు





**మందమర్రి, జూలై 25:** మంచిర్యాల జిల్లా. నేటి ప్రభాతా సూర్య. టి.యు.డబ్ల్యూ.జె (ఐజేయు) జిల్లా కార్యవర్గ సమావేశం శుక్రవారం రోజున మందమర్రి సింగరేణి సి.ఈ.ఆర్ క్లబ్‌లో విజయవంతంగా జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కమిటీ మెజారిటీ ప్రతిపాదనల మేరకుఅనేకకీలకనిర్ణయాలు తీసుకున్నారు. భవిష్యత్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాలను ముందుగా జిల్లా కమిటీకి సమాచారం ఇచ్చిన తర్వాత మాత్రమే చేపట్టాలని నిర్ణయించారు. ఇటీవల జిల్లా కలెక్టర్ పాత్రికేయులపై చేసిన ఆరోపణలను యూనియన్ తీవ్రంగా ఖండించింది. ఈ నేపథ్యంలో కలెక్టర్‌ను కలిసి వివరణ కోరేలా సోమ, మంగళ, బుధవారాల్లో ఏదో ఒక రోజు యూనియన్ ప్రతినిధులు మరియు జిల్లాలోని మీడియా సభ్యులు కలుసుకునేందుకు నిర్ణయం తీసుకున్నారు. సోషల్ మీడియాలో యూనియన్‌ను టార్గెట్ చేస్తూ కొంతమంది దుష్ప్రచారం చేయడాన్ని ఖండించారు. ఇకపై ఎవరు విమర్శలు చేసినా, వెంటనే యూనియన్ తరఫున కౌంటర్ ఇవ్వాలని తీర్మానం చేశారు. అనర్హుల చేతుల్లో "ప్రెస్ స్టిక్కర్లు" [illegible]వుతోన్న విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి, అసలైన పాత్రికేయులకు మాత్రమే స్టిక్కర్లు అందేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో అధ్యక్షుడు దేగ సత్యం, ప్రధాన కార్యదర్శి పింగళి సంపత్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, వంశీ, సురేష్ చౌదరి, మద్దెల సంజీవ్, రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రెస్ క్లబ్ సభ్యుల విన్నపాలు ఆలకించి, సమస్యల పరిష్కారానికి సహకారం అందించేందుకు హామీ ఇచ్చారు. గతంలో బొడ్డు రవి వాల్మీకి మృతి నేపథ్యంలో యూనియన్ చేపట్టిన సహాయ చర్యలను సమావేశంలో గుర్తుచేశారు. కొంతమంది అడ్రెస్ లేని వ్యక్తులు యూనియన్‌పై అసత్య ప్రచారం చేస్తున్నారని నేతలు ఆవేదన వ్యక్తం చేశారు.

## వన మహోత్సవంలో కాలనీ వాసులు



**షాద్‌నగర్, నేటి ప్రభాత సూర్యజోన్‌ఇంచార్జ్ (జూలై 25) :** వాతావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందడుగు వేయాలని షాద్‌నగర్ మున్సిపాలిటీ కమిషనర్ సునీత అన్నారు. శుక్రవారం నాడు షాద్‌నగర్ మున్సిపాలిటీ 6వ వార్డు సాయిబాబా కాలనీలో నిర్వహించిన వన మహోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించి, స్వయంగా మొక్కలు నాటి భవిష్యత్ తరం కోసం హరిత పథాన్ని బలపరిచారు. ఈ కార్యక్రమాన్ని మాజీ కౌన్సిలర్ శ్రీమతి లతా శ్రీశైలం గౌడ్, కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మంగ శంకర్ ముదిరాజ్,ఆధ్వర్యంలో నిర్వహించగా, ప్రధాన కార్యదర్శి బొబ్బిలిగామ శ్రీనివాసులు, క్యాషియర్ కే. శ్రీశైలం, మాజీ గౌరవ అధ్యక్షులు ఆంజనేయులు, అమర్నాథ్ రెడ్డి, ఎల్ఐసి రాములు నాయక్, ప్యాట విష్ణువర్ధన్, అర్. అజయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ సునీత మాట్లాడుతూ.."ప్రతి ఒక్క ఇంటి ముందు ఒక్క మొక్కను నాటి, దాన్ని పెంచడమే భవిష్యత్ పర్యావరణానికి మనం అందించే గొప్ప బహుమతి" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కాలనీవాసులు వన మహోత్సవాన్ని విజయవంతం చేస్తూ పెద్ద సంఖ్యలో మొక్కలు నాటారు.

## పోలీస్ శాఖ ప్రతిష్ట పెంపొందించాలి



**జులై 25, 2025 నేటి ప్రభాతా సూర్య మంచిర్యాల:** పోలీస్ శాఖ యొక్క సేవలను మరింత ప్రజల మద్దతుతో ముందుకు తీసుకెళ్లాలంటే అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా సూచించారు. శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల్లో సైబర్ నేరాల పట్ల అవ గాహన కల్పించేందుకు పక్కా కార్యాచరణ రూపొందించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రానున్న పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా సాగేందుకు ఇప్పటి నుంచే తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పాత నేరస్తులు, రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి, అవసరమైతే కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇలాంటి చర్యలతో పోలీస్ శాఖపై ప్రజల్లో ఉన్న విశ్వాసం మరింత పెరుగుతుందని కమిషనర్ తెలిపారు.

## పారువెల్లలో రైతులకు అవగాహన కార్యక్రమం



**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:** గన్నేరువరం మండల పరిధిలోని పారువెల్ల గ్రామంలో శుక్రవారం రైతులకు వ్యవసాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సెంట్రల్ గవర్నమెంట్ నుండి వచ్చిన అధికారులు మండల పంటలపై రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు . ఈ అవగాహన కార్యక్రమంలో ఏఓ కిరణ్ మై. ఏఈఓ అనూష. సెంట్రల్ అధికారులు. వెంకట్ రెడ్డి. అన్నప్ప గౌడ్. బసవన్న. గ్రామ రైతులు పాల్గొన్నారు.

## జనహిత సేవాసమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



**బెల్లంపల్లి, జూలై 25 (నేటి ప్రభాత సూర్య):** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జనహిత సేవాసమితి ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో దాత సిలువేరు రాజేశ్వరరావు గారి జ్ఞాపకార్థంగా ఆయన కుటుంబ సభ్యుల సహకారంతో యాచకులు, బాటసారులు, చిరు వ్యాపారులకు ఉచితంగా భోజనం అందించారు. ఈ సందర్భంగా జనహిత సేవాసమితి కార్యవర్గ సభ్యులు, దాత కుటుంబ సభ్యులు, స్థానిక యువకులు పాల్గొని సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. "సామాజిక బాధ్యతగా మనం సహాయహస్తం అందించాలి" అనే సందేశంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమాన్ని స్థానికులు అభినందించారు.

## మీడియా వాస్తవాలను వెలుగులోకి తేయాలి: లెక్టర్ కుమార్ దీపక్




**మంచిర్యాల, జూలై 25 (నేటి ప్రభాతా సూర్య):** జిల్లాలో మీడియా వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలి అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు రాజ్యాంగం కల్పించిన పత్రికా స్వేచ్ఛను సద్వినియోగపరచుకొని ప్రజలకు ఉపయోగపడేలా నిజాంశాలను ప్రచురించాలన్నారు. కొందరు పాత్రికేయులు అవాస్తవ కథనాలను ప్రోత్సహిస్తూ, వ్యాపార, వాణిజ్య సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యక్తిగతంగా బెదిరింపులకు పాల్పడి డబ్బులు వసూలు చేస్తున్న ఘటనలు తమ దృష్టికి వచ్చాయని ఆయన తెలిపారు. ఇది మీడియా నైతికతకు విరుద్ధమని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## వీధి కుక్కల పట్టివేత చర్యలు




**మంచిర్యాల జిల్లా, జూలై 25 (నేటి ప్రభాతా సూర్య):** చెన్నూర్ పట్టణంలో వీధి కుక్కల సంఖ్య అధికమవుతుండటంతో, మున్సిపల్ అధికారులు వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టారు. గురువారం ప్రత్యేక సిబ్బందిని రంగంలోకి దించి, పట్టణంలోని వివిధ వీధుల్లో తిరుగుతున్న వీధికుక్కలను పట్టించారు. కుక్కల్ని శస్త్రచికిత్సల నిమిత్తం మంచిర్యాలలోని జంతు సంరక్షణ కేంద్రానికి తరలించినట్టు మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు.

## బిజెపి అధ్యక్షుని పర్యటన విజయవంతం చేద్దాం : అందే బాబయ్య



**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై 25):** నేడు శనివారంనాడు బిజెపి రాష్ట్ర అధ్యక్షులుగా ఎన్నికైన తరువాత మొదటి సారి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా పర్యట నకు విచ్చేస్తున్న యన్.రామ్ చందర్ రావు మరియు బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు యంపీ డీకే అరుణ తిమ్మాపూర్ శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం దగ్గర ఉదయం 8:00 లకు స్వాగత కార్యక్రమం ఉంటుంది. కావున ఈ కార్యక్రమంలో షాద్ నగర్ నియోజకవర్గం ముఖ్య నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయగలరని. అందే బాబయ్య బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,షాద్ నగర్ నియోజకవర్గం ఇంచార్జి ఓ ప్రకటనలో తెలిపారు.

## పటేల్ రోడ్డులో సీసీ రోడ్డుల నిర్మాణాన్ని పరిశీలించిన నాయకులు



**షాద్‌నగర్, నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ జూలై 25 :** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని 21వ వార్డులో పటేల్ రోడ్డునుంచి చటన్‌పల్లి రైల్వే గేట్ వరకు నిర్మిస్తున్న సీసీ రోడ్డుల పనులను శుక్రవారం స్థానిక నాయకులు పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని వారు అధికారులకు కాంట్రాక్టర్ కు సూచించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. "పౌరులకు మెరుగైన రోడ్డు సదుపాయాలు కల్పించేందుకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఈ అభివృద్ధి చర్యలు చేపట్టాం. నిర్మాణంలో మేటి ప్రమాణాలు పాటించడం ద్వారా ప్రజలకు ఉపయోగపడే విధంగా పనులు కొనసాగుతున్నాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, సీనియర్ నాయకుడు అగ్గనూర్ బస్వం, మాజీ వార్డు సభ్యురాలు శ్రీమతి భారతమ్మ, చందులాల్, శేఖరప్ప శంకర్, నందు, నీరటి వాసు తదితరులు పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యం, నాయకుల పర్యవేక్షణతో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.

సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784


# గర్భిణీ స్త్రీలకు కెసిఆర్ కిట్లు పంపిణీ

### మాజీ సర్పంచ్ హబీబ్ ద్దీన్



**యాచారం నేటి ప్రభాత సూర్య ( జులై 25):**
మాజీ ఐటి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జన్మదిన శుభ సందర్భంగా.. గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు కెసిఆర్ కిట్లను కొత్తపల్లి మాజీ సర్పంచ్ మహమ్మద్ హాబీబ్ ద్దీన్ పంపిణీ చేశారు. శనివారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కెసిఆర్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేశారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలు అమలు చేయడం లో విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కెసిఆర్ ప్రభుత్వంలోని ప్రజలకు న్యాయం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి: ఆస్పత్రిని తనిఖీ చేసిన కలెక్టర్.

**రంగారెడ్డి - నేటి ప్రభాత సూర్య :**
ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, సానిటేషన్ చేపట్టాలని, రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత ఆసుపత్రి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి రంగారెడ్డి జిల్లాలోని శంషాబాద్ కమ్యూనిటి ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి సరిపడా వైద్య సిబ్బంది ఉన్నారా? లేదా ? అని అక్కడి మెడికల్ ఆఫీసర్ ను అడిగారు. సిబ్బంది అవసరమైతే తనకు తెలియజేయాలన్నారు. హాజరు పట్టిక ప్రకారం వైద్యాధికారి, సిబ్బంది విధుల్లో ఉన్నారా లేదా అని పరిశీలించారు. సి.హెచ్.సీ ద్వారా అందిస్తున్న వైద్య సేవల గురించి మెడికల్ ఆఫీసర్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని రకాల ఔషధాలు సరిపడా అందుబాటులో ఉండాలని, సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు



జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఆసుపత్రికి రోజు ఎంతమంది అవుట్ పేషంట్, ఇన్ పేషెంట్లు వస్తుంటారని డాక్టర్ ను ప్రశ్నించారు. ఆస్పత్రిలోని అన్ని వార్డులను సందర్శించారు. ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని మెడికల్ ఆఫీసర్ ను ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో వర్షపు నీరు నిల్వ ఉండకుండ వారం రోజుల్లో చర్యలు తీసుకొని శుభ్రంగా ఉంచాలని తెలిపారు. కమ్యూనిటి హెల్త్ సెంటర్లో డయాలసిస్ పేషంట్లకు అవసరమైన నీరు అందించుటకు ఇబ్బందిగా ఉందని కలెక్టర్ దృష్టికి మెడికల్ ఆఫీసర్ తీసుకొని వచ్చారు. అందుకు కలెక్టర్ స్పందిస్తూ వారం రోజుల్లో నీటి సమస్యను పరిష్కరించాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వం వైద్యం, విద్య పై ప్రత్యేక దృష్టి పెట్టినందున ప్రభుత్వ అంచనాలకు తగిన విధంగా ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ సీ వైద్యాధికారి దుర్గలత, శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ సుమన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాలి : కమిషనర్ అమరేందర్ రెడ్డి





**తుర్కయంజాల్-నేటి ప్రభాత సూర్య:**
ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని తుర్కయంజాల్ పురపాలక సంఘం కమిషనర్ కె. అమరేందర్ రెడ్డి అన్నారు. 100 రోజుల అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధి కోహెడలోని 2,4,5 వార్డులలో పలు కాలనీలలో వార్డ్ అధికారులు పూల మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మొక్కల పెంపకం సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు.వాతావరణ సమతుల్యత, మానవాలి మనుగడకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. వార్డు అధికారులు రాకేష్, శేఖర్, బిల్ కలెక్టర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో హీరా మిల్లెట్స్ ఫుడ్స్ క్యాంటీన్ ప్రారంభం



**కరీంనగర్ - నేటి ప్రభాత సూర్య:**
దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతుండడంతో ప్రజలు ఆహారపు అలవాట్లను మార్చుకుంటున్నారు. సిరి ధాన్యాలతో మిల్లెట్స్ ఫుడ్ ను తయారుచేసిన ఆహారాన్ని తీసుకునేందుకు ఇష్టపడుతున్నారు. కొందరు వీటిని ఇంట్లోనే తయారు చేసుకుంటూ ఉండగా మరికొందరు వాటిని ఎలా వండుకోవాలో తెలియక ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి వారికోసం గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన మండ దిలీప్ గౌడ్ వినూత్న ఆలోచన చేశారు. సిరి ధాన్యాలతో




అల్పాహారాన్ని తయారు చేస్తూ కరీంనగర్ కలెక్టరేట్ లో హీరా క్యాంటీన్ ఓపెన్ చేసి విక్రయిస్తున్నారు. సాధారణ ప్రజలు సైతం వీటిని ఇష్టంగా తింటున్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నట్టుగా ప్రజలు మిల్లెట్ ఫుడ్స్ పై ఆసక్తి చూపుతు ఇష్టంగా తింటున్నారు. మిల్లెట్ ఫుడ్స్ క్యాంటీన్ ఓపెన్ చేసిన మండ దిలీప్ గౌడ్ ను పలువురు అభినందించారు.

# ఎడతెరిపిలేని వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**నేటి ప్రభాత సూర్య -రంగారెడ్డి జిల్లా బ్యూరో :**
రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంకా 48 గంటలు వర్షాలు ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపినట్లు అయన శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా వరదలు సంభవించినప్పుడు ప్రజలకు సహాయ, సహకారాలు అందించడానికి కలెక్టరేట్‌లో టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు . అత్యవసర పరిస్థితుల్లో, బాధితులు సహాయం కోసం ఈ టోల్ ఫ్రీ నంబర్: 040-23237416కు కాల్ చేయవచ్చని,



వెంటనే జిల్లా యంత్రాంగం స్పందించి సహాయం అందిస్తుందని కలెక్టర్ ప్రకటనలో వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం కోసం ఏర్పాటు చేసినటోల్‌ఫ్రీనెంబర్24గంటలు పనిచేస్తుందనిఆయన అన్నారు.

# ముఖ్యమంత్రి కలిసిన బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు

**మంచిర్యాల జిల్లా నేటి ప్రభాతా సూర్య. జులై 25:**
బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం శ్రమిస్తున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ నాయకుల బృందం గురువారం హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి అధికార నివాసాన్ని సందర్శించింది.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే తో పాటు నియోజకవర్గంలోని 各 మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసారు. బెల్లంపల్లి నియోజకవర్గంలో ఎదురవుతున్న ప్రధాన సమస్యలు, మౌలిక వసతుల కొరత, అభివృద్ధి పనుల ప్రాధాన్యతలపై ముఖ్యమంత్రితో విస్తృతంగా చర్చించారు.నియోజకవర్గానికి మరింత నిధులు కేటాయించాలని, పలు సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ వినతులను సానుకూలంగా స్వీకరించారు. బెల్లంపల్లి అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయి



లో సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి స్పందనపై హర్షం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి, బెల్లంపల్లి ప్రజల తరఫున సీఎం రేవంత్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# మహిళను కామెంట్స్ చేసిన ఆకతాయికి దేహశుద్ధి

**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:**
ఆరు బయట ఉన్న మహిళలను కామెంట్ చేసిన యువకుడికి స్థానికులు దేహశుద్ధి చేశారు. బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన ఓ మహిళను అదే గ్రామానికి చెందిన మునిగంటి మధు అనే యువకుడు తరచూ వేధిస్తూ బూతులు మాట్లాడుతూ చంపుతానని బెదిరించడంతో శుక్రవారం ఆ మహిళ బంధువులు కొంతమంది వ్యక్తులు కలిసి యువకుడ్ని పశు వైద్యశాల



చౌరస్తాలో కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం గన్నేరువరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని యువకున్ని పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# నిరుపయోగంగా గ్రామ వారసంత




**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:**
గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పండించిన కూరగాయలను గ్రామ పరిధిలోనే విక్రయించుకునేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామ సంతల నిర్మాణం గతంలో చేపట్టిన విషయం తెలిసిందే.. లక్షలు వెచ్చించి నిర్మించిన వార సంతలు గ్రామాల్లో నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. గన్నేరువరం మండలంలోని జంగపల్లి గ్రామంలో గ్రామసంత నిర్మాణం చేపట్టినప్పటికి నిరుపయోగంగానే దర్శనమిస్తున్నది. గ్రామస్తులు గ్రామ సంతలను వినియోగించుకోవడం గమనార్హంగా మారింది. గ్రామ సంతల నిర్మాణం జరగకముందు ఎక్కడైతే కూరగాయల క్రయవిక్రయాల జరుగాయో ప్రస్తుతం అక్కడే రోడ్లపై విక్రయాలు చేపడుతున్నారు. లక్షలు వెచ్చించి నిర్మించిన గ్రామ సంతలు శునకాలకు ఆవాసాలుగా మారగా మరికొన్ని గ్రామాల్లో తాగుబోతులకు అడ్డాగా మారాయి. వెచ్చించినా ప్రజాధనం దుర్వినియోగమైపోతుంది. అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

# పులిమడుగులో సాంప్రదాయబద్ధంగా తీజ్ ఉత్సవాలు

### ముఖ్యఅతిథిగా రామకృష్ణాపూర్ ఎస్ఐ రాజశేఖర్

**మంచిర్యాల జిల్లా,నేటి ప్రభాతా సూర్య. జులై 25:**
మంద్రమర్రి మండలం: పులిమడుగు గ్రామంలో శుక్రవారం లంబాడీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో రామకృష్ణాపూర్ పట్టణ పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ) రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "లంబాడీల సంప్రదాయ ప్రకారం ప్రతి రెండేళ్లకోసారి తీజ్ పండుగను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. పెళ్లికాని యువతులు తొమ్మిది రోజులపాటు ఉపవాసం ఉండి భక్తి శ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటారు," అని తెలిపారు.స్థానికులు ఉత్సాహంగా



పాల్గొనగా, ఉత్సవాల సందర్భంగా పాటలు, నృత్యాలు, పూజార్చనలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో పండుగ శోభా వెల్లివిరిసించిది.

# సీఈఐఆర్ సేవలను వినియోగించుకోవాలి: ఎస్సై నరేందర్ రెడ్డి



**కరీంనగర్ (గన్నేరువరం)- నేటి ప్రభాత సూర్య:**
పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ ను సీఈఐఆర్ టెక్నాలజీతో బాధితునికి అప్పగించిన ఎస్సై నరేందర్ రెడ్డి, కానిస్టేబుల్ పురాణం సాయి ప్రేమ్... మండలం లోని ఖాసింపేట గ్రామానికి చెందిన సందనవేణి పరుశరాములుకు చెందిన మొబైల్ ఫోనును తేదీ 24-05-2024 రోజున పోగొట్టుకున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన సీఈఐఆర్ అనే వెబ్సైట్లో ఫోన్ యొక్క ఐఎంఈఐ నెంబర్ ను ఎంటర్ చేసి బ్లాక్ చేశారు. వెంటనే ఫోన్ దొరికిన వ్యక్తి దానిలో సిమ్ కార్డు వేసుకోవడంతో, ఈ వెబ్సైట్ ద్వారా అతని వివరాలతో కూడిన సమాచారం గన్నేరువరం పోలీసులకు చేరింది. సమాచారం అందుకున్న పోలీసులు ఫోన్ దొరికిన వ్యక్తి నుంచి ఫోన్ ను స్వాధీనం చేసుకుని, పోగొట్టుకున్న వ్యక్తికి అందజేశారు.

# సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటాలకు పిలుపు ఇవ్వండి : సీఐటీయూ

**మందమర్రి, జూలై 25 (మంచిర్యాల జిల్లానేటి ప్రభాతా సూర్య.)**
సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) మందమర్రి బ్రాంచ్ కార్యదర్శి అల్లి రాజేందర్ తెలిపారు का కార్మికుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కారమయ్యే దిశగా ఐక్య పోరాటాలకు అన్ని కార్మిక సంఘాలను పిలవాల్సిన అవసరం ఉందని అన్నారు.ఇప్పటివరకు డైరెక్టర్ (పా) వద్ద రెండు సార్లు, చైర్మన్ వద్ద ఒకసారి జరిగిన స్ట్రక్చర్ సమావేశాల్లో సొంతింటి కల, అలవెన్సుపై ఆదాయపు పన్ను మాఫీ, క్యాడర్ స్కీముల మార్పు, మారుపేర్ల సవరణ వంటి సమస్యలపై చర్చించినా, పరిష్కారాలు మాత్రం ఆచరణలోకి రాలేదని విమర్శించారు.ఏఐటీయూసీ గుర్తింపు సంఘంగా ఉన్నా, ఇప్పటివరకు ఒక్క అంశంపైనా ఒత్తిడి తెచ్చి కమిటీలు ఏర్పరచడంలో విఫలమైందని మండిపడ్డారు. "బాటా బూట్లు, నాణ్యమైన పరికరాలు కూడా ఇప్పించలేకపోతే, కార్మికుల ఆశలు వమ్మవుతాయి. సమస్యలపై పోరాటం చేయకుండా ప్రతిపక్షాలపై నిందలు వేయడం సరైంది కాదు," అని వ్యాఖ్యానించారు.ఎన్నికలు జరిగి ఒకటిన్నర సంవత్సరం




అవుతున్నా, మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన అంశాలు ఇంకా అమలు కాలేదని గుర్తుచేశారు. కార్మిక సమస్యల పరిష్కారానికి అన్ని కార్మిక సంఘాలతో కలిసి ఐక్య పోరాటానికి ఏఐటీయూసీ ముందుకు రావాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బుద్దే సురేష్, దనిశెట్టి సురేష్, విద్యాసాగర్, ప్రశాంత్, నాగరాజులుతదితరులు పాల్గొన్నారు.

# టూ టౌన్ ఎస్ఐగా సిహెచ్ కిరణ్ కుమార్ బాధ్యతల స్వీకరణ

**మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి ,జూలై 25 , నేటి ప్రభాతా సూర్య**




బెల్లంపల్లి టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్సైగా సిహెచ్ కిరణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చేరిక సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆయనకు హార్దికంగా స్వాగతం పలికారు మరియు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్సై కిరణ్ కుమార్ మాట్లాడుతూ, "ప్రజల పరిరక్షణే మా ప్రధాన లక్ష్యం. శాంతి భద్రతల పటిష్ఠతకు నిబద్ధంగా పని చేస్తాను," అని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు మరియు ప్రభుత్వ అధికారులు సక్రమంగా సహకరించాలని కోరారు.

# గురువుగారికి జన్మదిన శుభాకాంక్షలు

### శాలువాతో సన్మానం కేక్ కట్‌తో 79వ జన్మదిన వేడుకలు

**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై 25):**
షాద్‌నగర్ గ్రేడ్ వన్ శాఖ గ్రంథాలయం అధ్యక్షులు కొప్పుల మదన్ మోహన్ రెడ్డి గారు 79వ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గ్రంథాలయ కమిటీ సభ్యులు వైస్ చైర్మన్ నక్క బాలరాజ్ యాదవ్, సి. విరేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి క్యాసెట్టి శ్రీనివాస్, జాయింట్ సెక్రెటరీ జూపల్లి చంద్రశేఖర్, సింగప గా అనిల్ కుమార్, ఆర్గనైజర్ అల్వాల దర్శన్ గౌడ్, ట్రెజరర్ నీళ్ల రవీందర్ గౌడ్, జాయింట్ సెక్రెటరీ కత్తి చంద్రశేఖర్‌అప్ప, డైరెక్టర్లు తూం కృష్ణారెడ్డి, ర్యాకల శ్రీకాంత్, అక్రమ్, ఫయాజ్, కాట్న రాజేష్, చీపిరి శివరాంలు యాదవ్ ఆలోనపల్లి రాజు గౌడ్ రవి నాయక్ జుట్టు అనిల్ కుమార్ అనిల్ కుమార్ యాదవ్ శాలువా కప్పి సన్మానించి, కేక్ కట్ చేసి గురువుగారికి



జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ %-% రెడ్డి సంఘం అధ్యక్షుడు, లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, ప్రభుత్వ రిటైర్డ్ ఉపాధ్యాయునిగా మాత్రమే కాకుండా, వాస్తు శాస్త్రం, లా శాస్త్రం రంగాల్లో విశేష అవగాహన కలిగి ఉన్న మదన్ మోహన్ రెడ్డి గారు అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ యువతకు సలహాలు, సూచనలు అందిస్తూ మార్గదర్శకుడిగా నిలుస్తున్నారని, వారు తెలిపారు.

# పీఏసీఎస్ ద్వారా యూరియా పంపిణీ

### కేశంపేట మండలంలో రైతులకు యూరియా సరఫరా

### వ్యవసాయ అధికారి శిరీష

**షాద్ నగర్ నేటి ప్రభాత సూర్య జోన్ ఇంచార్జ్ (జూలై 25):**
ప్రభుత్వం రైతుల నాణ్యమైన పంటల ఉత్పత్తికి అవసరమైన ఎరువుల సరఫరాలో భాగంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా యూరియా పంపిణీ చేపట్టింది. ఈ క్రమంలో శుక్రవారం కేశంపేట మండలంలోని రైతులకు యూరియా అందజేయబడిందని మండల వ్యవసాయ అధికారి శిరీష తెలిపారు.రైతులు తమ పట్టాదారు పాసుబుకులు చూపించి పిఎసిఎస్ కేంద్రాల వద్ద యూరియా తీసుకోవచ్చని ఆమె సూచించారు. ఈ కార్యక్రమం రైతులకు అనుకూలంగా సాగుతుందని, ఎలాంటి లోపాలైతే వెంటనే అధికారులను సంప్రదించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.



నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

## క్రీడారంగం

# 15 ఫోర్లు, 7 సిక్సర్లు

## ఏబీ డివిలియర్స్ ఊచకోత



దక్షిణాఫ్రికా ఆటగాడు ఏబీ డివిలియర్స్ 2025 వరల్డ్ ఛాంపియన్‌షిప్ ఆఫ్ లెజెండ్స్‌లో దుమ్మురేపుతున్నాడు. ఇంగ్లాండ్ ఛాంపియన్స్‌తో జరిగిన 8వ మ్యాచ్‌లో, డివిలియర్స్ తన తుఫాను బ్యాటింగ్‌తో బౌలర్లను ఆశ్చర్యపరిచాడు. దక్షిణాఫ్రికా ఛాంపియన్స్ తరపున డివిలియర్స్ కేవలం 41 బంతుల్లోనే సెంచరీ చేసి జట్టుకు సులభమైన విజయాన్ని అందించాడు. టోర్నమెంట్‌లో దక్షిణాఫ్రికాకు ఇది వరుసగా రెండో విజయం. ఈ మ్యాచ్‌లో ఏబీ డివిలియర్స్ 51 బంతుల్లో 116 పరుగులతో అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 15 ఫోర్లు, 7 సిక్సర్లు కూడా ఉన్నాయి. ఈ విధంగా, దక్షిణాఫ్రికా ఒక్క వికెట్ కూడా కోల్పోకుండా మ్యాచ్‌ను గెలుచుకుంది. మ్యాచ్ గురించి మాట్లాడితే, టాస్ గెలిచిన తర్వాత దక్షిణాఫ్రికా ఇంగ్లాండ్‌ను ముందుగా బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. దక్షిణాఫ్రికా ఇంగ్లాండ్ ఛాంపియన్‌లను నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేయడానికి అనుమతించింది. ఓపెనర్ ఫిల్ మస్టర్డ్ తప్ప, మరే ఇతర ఇంగ్లాండ్ బ్యాట్స్‌మన్ కూడా అద్భుతాలు చేయలేకపోయాడు. మస్టర్డ్ 39 పరుగుల ఇన్నింగ్స్ ఆడాడు. ఇంకా, మిడిల్ ఆర్డర్‌లో, కెప్టెన్ ఇయోన్ మోర్గాన్ 20 పరుగులు, సమిత్ పటేల్ 24 పరుగులు చేశాడు. దక్షిణాఫ్రికా ఛాంపియన్ల తరపున వేన్ పార్నెల్, ఇమ్రాన్ తాహిర్ చెరో రెండు వికెట్లు పడగొట్టగా.. డ్వేన్ ఆలివర్, క్రిస్ మోరిస్ చెరో ఒక వికెట్ తీసుకున్నారు. ఈ బౌలర్లు ఇంగ్లాండ్ ఛాంపియన్స్ బ్యాట్స్‌మెన్‌ను ఫ్రీ స్ట్రోక్స్ ఆడనివ్వకుండా కట్టుదిట్టంగా బౌలింగ్ చేశారు. కేవలం 153 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దక్షిణాఫ్రికా జట్టుకు ఎబి డివిలియర్స్ ప్రాణాంతకంగా మారాడు. హషీమ్ ఆమ్లాతో కలిసి ఇన్నింగ్స్ ప్రారంభించిన డివిలియర్స్ ఇంగ్లాండ్ బౌలర్లకు చెమటలు పట్టించాడు. మరో ఎండ్‌లో ఆమ్లా అతనికి మంచి మద్దతు ఇచ్చాడు. దక్షిణాఫ్రికా విజయానికి హషీమ్ ఆమ్లా 25 బంతుల్లో 29 పరుగులు అందించాడు. ఆమ్లా తన ఇన్నింగ్స్‌లో మొత్తం 4 ఫోర్లు కూడా కొట్టాడు. ఈ విధంగా, దక్షిణాఫ్రికా కేవలం 12.3 ఓవర్లలోనే మ్యాచ్‌ను ముగించింది. బౌలింగ్ గురించి చెప్పాలంటే, ఇంగ్లాండ్ జట్టులో అత్యంత ఖరీదైన బౌలర్ స్టువర్ట్ మేకర్. అతను 3 ఓవర్లలో 37 పరుగులు ఇచ్చి ఒక్క వికెట్ కూడా తీసుకోలేదు. అంతేకాకుండా, అజ్మల్ షాజాద్ 3.2 ఓవర్లలో 31 పరుగులు ఇచ్చాడు. మిగిలిన బౌలర్లు కూడా చాలా ఖరీదైనవారు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయారు.



# చరిత్ర సృష్టించిన కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్

చెస్ ప్రపంచ కప్‌లో భారత్ చరిత్ర సృష్టించింది. చెస్ వరల్డ్ కప్ ఫైనల్‌కు చేరుకున్న మొదటి భారత క్రీడాకారిణిగా దివ్య దేశ్‌ముఖ్ నిలిచింది. ఫైనల్ చేరిన రెండో భారత క్రీడాకారిణిగా తెలుగు తేజం, గ్రాండ్ మాస్టర్ కోనేరు హంపి నిలిచింది. అంంతకు ముందు ఫిడె చెస్ వరల్డ్ కప్ సెమీఫైనల్లోకి ప్రవేశించిన తొలి భారత క్రీడాకారిణిగా కోనేరు హంపి చరిత్ర సృష్టించగా, ఈ జాబితాలో రెండో క్రీడాకారిణిగా దివ్య దేశ్‌ముఖ్ నిలిచింది. భారతదేశానికి చెందిన గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి ఫిడే చెస్ ప్రపంచ కప్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. గురువారం రాత్రి జరిగిన సెమీ-ఫైనల్ టై బ్రేక్‌లో చైనాకు చెందిన టింగ్‌జీ లేయిని ఓడించి కోనేరు హంపి ఫైనల్లోకి ప్రవేశించింది. ఈ విజయంతో కోనేరు వచ్చే ఏడాది జరగనున్న కాండిడేట్స్ టోర్నమెంట్‌కు నేరుగా అర్హత సాధించారు. ఫైనల్లో భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్‌తో హంపి తలపడనుంది. చెస్ ప్రపంచకప్‌లో రెండో సెమీఫైనల్ భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి, చైనాకు చెందిన టింగ్‌జీ లేయి మధ్య జరిగింది. అయితే ఈ సెమీఫైనల్‌లో 2 క్లాసికల్ లెగ్‌లు డ్రాగా ముగియడంతో ఫలితాన్ని తేల్చడానికి టై బ్రేక్ నిర్వహించాల్సి వచ్చింది. గురువారం రాత్రి జరిగిన టైబ్రేక్‌లో చైనా క్రీడాకారిణి టింగ్‌జీని 5-3 తేడాతో ఓడించి కోనేరు హంపి ఫైనల్‌కు చేరుకుంది. చెస్ వరల్డ్ కప్‌లో ఫైనల్ చేరడం ఆమెకు ఇదే తొలిసారి. ఫిడే మహిళల చెస్ వరల్డ్ కప్ ఉత్కంఠభరితంగా సాగుతోంది. తొలిసారి ఇద్దరు భారత క్రీడాకారిణులు ఫైనల్ చేరుకున్నారు.



# గిల్ మైండ్‌సెట్‌ను మార్చుకోవాలి

## మాజీ క్రికెటర్ మైఖేల్ వాన్ సూచన

ఇంగ్లండ్‌తో నాలుగో టెస్ట్‌లో టీమిండియా పుంజుకోవాలంటే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తన మైండ్‌సెట్‌ను మార్చుకోవాలని మాజీ క్రికెటర్ మైఖేల్ వాన్ అన్నాడు. విరాట్ కోహ్లీ తరహాలో దూకుడుగా కెప్టెన్సీ చేయాలని సూచించాడు. మాంచెస్టర్ వేదికగా జరుగుతున్న నాలుగో టెస్ట్‌లో టీమిండియా వెనుకంజలో నిలిచింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో 358 పరుగులే చేసింది. అనంతరం ఇంగ్లండ్ దూకుడుగా తమ తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. ఓపె నర్ బాజ్ బాల్ గేమ్‌తో ఎదురుదాడికి దిగ డంతో ఒక్క సెషన్‌లోనే 148 పరుగులు చేసింది. రెండో రోజు ఆట అనంతరం శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై మాట్లాడిన మైఖేల్ వాన్.. ఇలా అయితే కష్టమని చెప్పాడు. మైదా నంలో దూకుడుగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించాడు. మూడో రోజు ఆటలో మెరుగైన ప్రదర్శన చేస్తేనే టీమిండియా ఈ మ్యాచ్‌తో పాటు సిరీస్‌లో పుంజుకోగలదన్నాడు. 'ఈ సిరీస్ గమనాన్ని మూడో రోజు ఆట నిర్దేశించనుంది. మూడో రోజు ఆటలో ఇంగ్లండ్ మెరుగైన ప్రదర్శన చేస్తే ఈ మ్యాచ్ గెలవడంతో పాటు సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. ఈ మ్యా చ్‌లో టీమిండియా పుంజుకోవాలంటే టీమిండియా తమ మైండ్‌సెట్‌ను మార్చుకోవాలి. శుభ్‌మన్ గిల్ విరాట్ కోహ్లీ మైండ్ సెట్‌తో రావాలి. మూడో రోజును ఆటను గెలవాలనే కసితో ఆడాలి. మూడో రోజు ఆటలో భారత్ గెలిస్తే.. ఈ మ్యాచ్ సజీవంగా ఉంటుంది. ఈ మ్యాచ్ గెలిచే అవకాశాలు కూడా ఉంటాయి. అలా కాకుండా మూడో రోజు చేతులెత్తేస్తే మాత్రం మ్యాచ్‌తో పాటు సిరీస్ కూడా చేజా రుతుంది.' అని మైఖేల్ వాన్ హెచ్చరించాడు. ఇక రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ 46 ఓవర్లలో 2 వికెట్లకు 225 పరుగులు చేసింది.




# విశ్వంభర షూటింగ్ బిజీలో చిరంజీవి

అగ్ర కథానాయకుడు మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'విశ్వంభర' సినిమా షూటింగ్ శరవేగంగా పూర్తి కావస్తోంది. ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సోషియో-ఫాంటసీ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి వశిష్ట దర్శకత్వం వహిస్తుండగా.. త్రిష కథానాయికగా నటిస్తుంది. యూవీ క్రియేషన్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రం ఈ ఏడాది చివరిలో ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ మూవీ నుంచి తాజాగా అప్‌డేట్‌ను పంచుకున్నాడు దర్శకుడు వశిష్ఠ. ఈ మూవీ చివరి షెడ్యూల్ షూటింగ్ తాజాగా స్టార్ట్ అయినట్లు- మెగాస్టార్ చిరంజీవి సెట్స్‌లో జాయిన్ అయినట్లు- ప్రకటించాడు. ఈ సందర్భంగా సెట్స్‌లో ఉన్న చిరు ఫొటోను పంచుకున్నాడు. అయితే లాస్ట్ షెడ్యూల్‌లో పాటను చిత్రీకరించబోతున్నట్లు తెలుస్తుంది. ఈ సినిమాలో ఓ రీమిక్స్ సాంగ్ ఉండబోతోందని ప్రచారం జరుగుతోంది. చిరంజీవి నటించిన సూపర్ హిట్ సినిమాలోని ఏదైన ఒక పాటను 'విశ్వంభర' సినిమాలో రీమిక్స్ చేయబోతున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఈ వార్తల్లో ఎంతవరకు నిజముందో తెలియదు కానీ సోషల్ మీడియాలో దీనిపై పెద్ద చర్చ జరుగుతోంది. బాలీవుడ్ నటి మౌని రాయ్ ఈ స్పెషల్ సాంగ్ లో చిరంజీవితో కలిసి స్టెప్పులు వేయనున్నారని కూడా సమాచారం. 'విశ్వంభర' సినిమాకు ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

నేటి ప్రభాత
సూర్య
జాతీయ తెలుగు దిన పత్రిక
TGTEL/25/A0784

## సినిమా




# తాండవం షూటింగ్‌లో బాలకృష్ణ

చిత్రసీమలో కొన్ని కలయికలు ఎంతో ప్రత్యేకం. వాళ్లు మళ్లీ జట్టు కట్టారంటే చాలు... అంచనాలు ఆకాశాన్ని తాకుతాయి. అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తారు. నందమూరి బాలకృష్ణ - బోయపాటి శ్రీను కలయిక అలాంటిదే! వరుసగా మూడు సినిమాలతో సంచలన విజయాల్ని సొంతం చేసుకున్నారు ఈ ఇద్దరూ. నాలుగో చిత్రం కోసం మరోసారి జట్టు కట్టారు. ఆ చిత్రం విజయవంతమైన 'అఖండ'కి కొనసాగింపుగా 'అఖండ 2: తాండవం' పేరుతో రూపొందుతోంది. 14 రీల్స్ ప్లస్ పతాకంపై రామ్ ఆచంట, గోపీ ఆచంట సంయుక్తంగా నిర్మిస్తున్నారు.

# పవన్ అభిమానుల అత్యుత్సాహం

## లండన్‌లో హరిహర వీరమల్లు నిలిపివేత

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'హరిహర వీర మల్లు' చిత్రం లండన్‌లోని ఓ థియేటర్‌లో ప్రదర్శితమవుతుండగా అనూహ్య ఘటన చోటు- చేసుకుంది. సినిమా స్క్రీనింగ్ సమయంలో కొందరు అభిమానులు కాన్ఫెట్టి (రంగు కాగితాలు) చల్లడంతో, థియేటర్ సిబ్బంది వెంటనే స్క్రీనింగ్‌ను నిలిపివేశారు. గురువారం ఈ సినిమా విడుదల కాగా.. యూకేలోని ఓ సింగిల్ స్క్రీన్ థియేటర్‌లో 'హరి హర వీర మల్లు' సినిమాను ప్రదర్శిస్తున్నారు. అయితే ఈ సినిమాను చూడటానికి వెళ్లిన అభిమానులు తమ హీరోపై అభిమానాన్ని చాటుకునేందుకు థియేటర్ లోపల కాన్ఫెట్టి చల్లడం మొదలుపెట్టారు.



ఇండియాలో తమ హీరోలకు ఇలాంటివి చల్లడం మనకు కనిపిస్తునే ఉంటాయి. అయితే విదేశాల్లోని థియేటర్లలో ఇలాంటి వాటికి అనుమతిలేదు. ఒకవేళ ఇలా పేపర్లు చింపి వేయాలి అనుకుంటే ముందుగానే థియేటర్ యాజమాన్యం వద్ద అనుమతిని తీసుకోవాలి. అయితే పవన్‌పై అభిమానం చూపేందుకు కాన్ఫెట్టిని చల్లిన అభిమానులపై థియేటర్ సిబ్బంది సీరియస్ అయ్యింది. దీంతో వెంటనే స్పందించి సినిమా ప్రదర్శనను నిలిపివేశారు. కాన్ఫెట్టి చల్లిన అభిమానులను థియేటర్ నుండి బయటకు వెళ్లిపోవాలని, ఇలాంటి చర్యలు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



# లక్ కోసం ఎదురు చూస్తున్న కృతిశెట్టి

తొలి సినిమాతోనే పాన్ ఇండియా స్థాయి లో గుర్తింపు తెచ్చుకున్న ముద్దుగుమ్మ కృతి శెట్టికి అదృష్టం ఎక్కువ కాలం నిలవలేదు. శ్యామ్‌సింగ రాయ్, బంగార్రాజు వంటి సినిమాల్లో కృతి ఓకే అనిపించు కున్నా ఆ తర్వాత వరుసగా చేసిన సినిమాలు మాత్రం ఆమెను స్టార్‌గా నిలబెట్టలేక పోయాయి. ప్రేక్షకులు పెద్దగా కనెక్ట్ కాకపోవడంతో ఆమెపై ఆసక్తి తగ్గిపోయింది. చివరగా.. 'మనమే' చిత్రంతో కూడా నిలవలేకపోయింది. దీంతో తెలుగులో అవకాశాలు తగ్గడంతో తమిళ సినిమాల వైపు దృష్టి పెట్టిన కృతి. ప్రస్తుతం అక్కడ ఎల్.ఐ.కె, జినీ సినిమాలు చేస్తుంది. ఈ రెండు సినిమాలపై ఆమె చాలా హోప్స్ పెట్టుకుంది. టాలీవుడ్‌లో మళ్లీ తన మార్క్ చూపించాలంటే, ఈ సినిమాల సక్సెస్ చాలా ఇంపార్టెంట్. ప్రస్తుతం టాలీవుడ్ డైరెక్టర్లు న్యూ ఫేస్‌లను ఎక్కువగా ఇంపార్టెన్స్ ఇస్తున్న సమయంలో, కృతి శెట్టి మళ్లీ గట్టిగా రీ ఎంట్రీ ఇవ్వాలంటే, కంటెంట్ బేస్డ్ సినిమా లేదా.. పవర్‌ఫుల్ పాత్రతో రీబౌండ్ కావాల్సిందే. తమిళ సినిమాల్లోని ఆమె పని తీరు బాగుంటే, టాలీవుడ్‌కి తిరిగి రావడం పెద్ద విషయమేమీ కాదు.

Printed Published and owned by Polagoni Rajesh, Printed at Smilys Online, Ranga Reddy (Dist), Telangana 501510. at H.No 4-136/12, Journalist colony, Turkayamjal, Ranga Reddy District, Telangana-501510. Editor: Polagoni Rajesh, epaper. www.prabhatha suryaa.com. Email. Prabhatasurya838 @gmail.com. PRGI REG NO.TGTEL/25/A0784.